

వర్షాకాలం లోపు ఆఫ్రాన్ నిర్మిస్తాం!

సోమశిల డ్యాం పరిరక్షణకు చర్యలు

మరమ్మతులకే రూ.140 కోట్లు అవసరం ● పొంగూరు, పడమటినాయుడుపల్లి రిజర్వాయర్ల నిర్మాణం ● కాంట్రాక్టర్లతో పనులు పూర్తి చేయిస్తాం! ● సోమశిలలో సీఎం చంద్రబాబు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 19 : 'ఒక ఆస్తిని నిర్మించడం ఎంత ముఖ్యమో దానిని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. చరిత్ర కలిగిన సోమశిల ప్రాజెక్టు పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. దెబ్బతిన్న గేట్లు రిపేరు చేయించి ఆఫ్రాన్ నిర్మిస్తాం. స్లూయిస్‌లో కూడా గోడ నిర్మిస్తాం. రాష్ట్రంలోని ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.300 కోట్లు అవసరమవుతుంది. ఒక్క సోమశిలకే రూ140 కోట్లు ఖర్చవుతుందని ఇంజనీర్లు నివేదిక ఇచ్చారు. వర్షాకాలంలోపు ఆఫ్రాన్ నిర్మాణం పూర్తి చేస్తాం. అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటారన్న ఉద్దేశంతోనే నేనే స్వయంగా వచ్చి ప్రాజెక్టు భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చాను' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని శ్రీసిటీలో పర్యటన ముగించుకొని హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3:30 గంటలకు సోమశిలకు చంద్రబాబు చేరుకున్నారు. అక్కడ నుంచి జలాశయం మీదకు వెళ్లి మరమ్మతులకు గురైన గేట్లను, దెబ్బతిన్న ఆఫ్రాన్‌ను పరిశీలించారు. మ్యాప్ పాయింటింగ్ ద్వారా ప్రాజెక్టు పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమశిల గ్రామంలో ప్రజలతో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 38 టీఎంసీల సామర్థ్యం ఉన్న సోమశిలను 78 టీఎంసీలకు పెంచిన ఘనత ఎన్టీ రామారావుకే దక్కుతుందని కొనియాడారు. సోమశిల, కండలేరు జలాశయాలను పరిరక్షించుకుంటే నెల్లూరు జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. 2018లో సోమశిలకు అనుకున్న స్థాయిలో నీళ్లు రానప్పుడు అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితిని తన దృష్టికి తీసుకొచ్చారని, ఆ వెంటనే శ్రీశైలం నుంచి 48 టీఎంసీల కృష్ణా జలాలను సోమశిలకు తీసుకొచ్చి రైతులను ఆదుకున్నామని చంద్రబాబు గుర్తు చేశారు. ఇప్పుడు కూడా కృష్ణా బేసిన్‌లో వరద వస్తుండటంతో ముందుచూపుతో ఆలోచించి శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను సోమశిలకు తీసుకొస్తున్నామని చెప్పారు. 2021లో పోటెత్తిన వరదకు సోమశిల ఆఫ్రాన్ దెబ్బతింటే వైసీపీ ప్రభుత్వం కనీసం మరమ్మతులు కూడా చేయలేదని విమర్శించారు. నాడు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పారిపోయారని అన్నారు. ఇప్పుడు పనులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామని, పారిపోతే పట్టుకొచ్చయినా పనులు చేయిస్తామని వ్యాఖ్యానించారు. ఇంజనీర్లు పాత రోజులు మర్చిపోయి ప్రాజెక్టు లపై దృష్టి పెట్టాలని సూచించారు. గేట్లు, ఆఫ్రాన్, కాలువల్లో పూడికతీత వంటి పనులు చూసుకోవాలని ఆదేశించారు. మెట్ట ప్రాంతంలో 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే పొంగూరు, పడమటినాయుడుపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.




ఇక 'సోమశిల'కు పూర్వ వైభవం : ఆనం

అనంతసాగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాకతో సోమశిల జలాశయానికి పూర్వ వైభవం వస్తుందని, అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదలవుతాయని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. సోమశిలలో జరిగిన ప్రజావేదికలో మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సోమశిల ప్రశ్నార్థకంగా మారిందని, దెబ్బతిన్న కట్టడాలతో ప్రమాదకరస్థితిలోకి ఉందని, డ్యాం అభివృద్ధికి సహకరించి రైతులను కాపాడాలంటూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబుకు విన్నవించుకోగా ఇప్పుడు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇకపై ప్రాజెక్టు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతాయని తెలిపారు. ఆనం సంజీవ్‌రెడ్డి హైలెవల్ కెనాల్ నిర్మాణంలో భాగంగా తొలుత పడమటినాయుడుపల్లి, పొంగూరు రిజర్వాయర్లు నిర్మించి 20 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయడంపై రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

● సీఎంకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లాకు వచ్చిన నారా చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కలెక్టర్ ఓ ఆనంద్, ఐజీ ఎస్ఎస్ త్రిపాఠి, ఎస్పీ జీ కృష్ణకాంత్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రజా వేదిక కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా కూడా ప్రజలు కేరింతలతో సంతోషాన్ని వ్యక్తపరిచారు. గతానికి భిన్నంగా ప్రజల మధ్యలోనే చంద్రబాబు కూర్చున్నారు. ముందుగా అనుకున్న సమయం ప్రకారం 4.45 గంటలకు కార్యక్రమం ముగించాల్సి ఉన్నప్పటికీ మరో గంట పాటు ప్రజల మధ్యనే గడిపారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకోవడంతోపాటు అర్జీలు స్వీకరించారు. షెడ్యూల్ ప్రకారం హెలికాప్టర్‌లో ఉండవల్లికి వెళ్లాల్సి ఉండగా చీకటి పడుతున్న నేపథ్యంలో తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి విమానంలో తిరుగుపయనమయ్యారు.



కలెక్టర్‌తో మాట్లాడుతూ..



వినతిపత్రాలు అందజేసేందుకు క్యూ కట్టిన జనం



సమాచార డీడీ సదారావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీఎం






సోమశిల గ్రామంలో జరిగిన ప్రజావేదికలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా!

● ప్రజావేదికలో సీఎం చంద్రబాబు హామీ



అనంతసాగరం, ఆగస్టు 19 : ప్రజావేదిక కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం సోమశిల జలాశయం సందర్శనకు వచ్చిన సీఎం రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై ప్రస్తావించగా సీఎం సానుకూలంగా స్పందించి సమాధానం ఇచ్చారు. 'ఈ వేదికలో మీరు చెప్పిన సమస్యలు పరిష్కారం అయ్యేలా కలెక్టర్ గారికి ఆదేశాలు జారీ చేస్తాం. సోమశిల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేయిస్తాము. ఉత్తర కాలువ నీటి కేటాయింపులకు శాసనం చేయలేము. అయితే రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకొంటా'మని హామీ ఇచ్చారు. ఇక ఇసుక రీచ్‌లో ఉపాధి కల్పన, అన్యాయం, దోపిడీ నిరావరణ చర్యలపై కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు సీఎం చెప్పారు.

సోమశిల ప్రమాదంలో ఉంది సార్!



సార్ గత ప్రభుత్వం సోమశిల ప్రాజెక్టును పట్టించుకోలేదు. ఎగువన కడప జిల్లాలో ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఆ వరద పోటెత్తి సోమశిలకు రావడంతో ప్రాజెక్టు కట్టడాలు ధ్వంసమయ్యాయి. అలాగే ఉత్తర, దక్షిణ కాలువల గట్లు కూడా దెబ్బతిని ఉన్నాయి. ఉత్తర కాలువ పరిధిలో కొంత మేరకు అటవీ అడ్డంకులతో పనులు నిలిచిపోయాయి పనులు పూర్తి చేయించండి సార్.

- కే మస్తాన్‌నాయుడు, ఆత్మకూరు

ఆసుపత్రి స్థాయి పెంచండి!



సోమశిలలో ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. కానీ అత్యవసర సేవలు, కాన్పుల కోసం 50 కి.మీ దూరం ఉన్న ఆత్మకూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడున్న ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేసేలా చూడండి సార్.

- భాగ్యమ్మ, సోమశిల

పశువైద్యశాల ఏర్పాటు చేయండి



సోమశిలలో పశువైద్యశాల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వైద్యం కోసం అనంతసాగరానికి వెళ్తున్నాం. పాడి రైతులకు మేలు జరిగేలా సోమశిలలో పశువైద్యశాల తెప్పించండి..

- అనీల్, సోమశిల

నీటి ఇబ్బందులు తీర్చండి!



సోమశిల హిల్ కాలనీలో మాఎస్టీ కాలనీ ఉంది సార్. అక్కడ గతంలో చిన్న ట్యాంక్ నిర్మించారు అయితే, ఆ నీరు మాకు చాలడం లేదు. నీటి ఇబ్బందులతో అవస్థలు పడుతున్నాం. ఆ ట్యాంక్‌ను పెద్దదిగా కట్టించి ఇవ్వండి సార్..

- పెంచలమ్మ, సోమశిల

ఉద్యోగం ఇప్పించండి!



సార్ మాది కావలి. 2002లో వలంటీర్ రిటైర్డుమెంట్ జీవోతో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకొన్నాను. అప్పట్లో మా కమిషనర్ పట్టించుకోలేదు. ఇప్పటికీ ఉద్యోగం రాక ఇబ్బందులు పడుతున్నాం. సాయం చేయండి సార్..

- శ్రీధర్, కావలి

నీటి కేటాయింపులకు చట్టబద్ధత



సోమశిల ఉత్తర కాలువ నీటి కేటాయింపునకు చట్టబద్ధత కల్పించి నీటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నాం సార్. ఆ దిశగా చర్యలు తీసుకొంటే నాన్‌డెల్టా రైతులకు మేలు జరుగుతుంది.

- ఓబుల్‌రెడ్డి, సర్పంచి పాతాళపల్లి

రీచ్‌లో కూలీలకు పని కల్పించండి



గతంలో టీడీపీ ప్రభుత్వంలో రీచ్‌లలో వాహనాలకు ఇసుక నింపేందుకు కూలీలతో పనులు చేయించేవారు. దీంతో మా పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన 900 కుటుంబాలకు పని లభించి రాజుల్లాగా బతికాం. ఈసారి కూడా యంత్రాలు లేకుండా కూలీలతో పనులు కల్పిస్తే ఉపాధితోపాటు భూగర్భజలాలు ఇంకిపోయే ప్రమాదం ఉండదు. ఆ దిశగా చర్యలు తీసుకోండి సార్.

- సురేష్, పడమటికంభంపాడు



ప్రజా వేదిక వద్ద మహిళలతో రాఖీ కట్టించుకుంటున్న చంద్రబాబు

ముప్పుతిప్పలు పెడుతున్న '2.0'

● రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి నిరీక్షణ

నెల్లూరు (హరనాథపురం) : డాక్యుమెంటు రిజిస్ట్రేషన్ విధానంలో గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 పద్ధతి వల్ల రిజిస్ట్రేషన్ చేసుకునే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. సోమవారం నగరంలోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి నిరీక్షణ తప్పలేదు. ఉదయం రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంటు ఇస్తే సాయంత్రానికి కూడా పని కావడం లేదు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు పది మంది రావడం వల్ల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కుర్చీలు కూడా సరిపోవటం లేదు. దీంతో ఎండలో నిలబడలేక, లోపల ఉండలేక వృద్ధులు అవస్థలు పడుతున్నారు. పాత విధానం 1.0 పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రిజిస్ట్రేషన్ల కోసం నిరీక్షిస్తున్న జనం

నిమ్మ ధరకు రెక్కలు

● 80 కిలోల బస్తా రూ.7వేలు

● తుఫాన్ల ప్రభావం, వర్షాభావంతో తగ్గిన దిగుబడి

పొదలకూరు, ఆగస్టు 19 : తగ్గుముఖం పట్టని ఉష్ణోగ్రతలు, శ్రావణ మాసం ప్రభావంతో నిమ్మ ధరలు ఎగబాకుతున్నాయి. గతంలో కేజీ రూ.29 నుంచి 40 ఉండగా, ప్రస్తుతం రూ.60 (హోల్‌సేల్) పలుకుతున్నాయి. ఇదే ధర రిటైల్‌గా రూ.120 వరకు ఉంటోంది. పొదలకూరు నిమ్మ మార్కెట్‌లో లూజు బస్తా (80 కేజీలు) రూ.5 వేల నుంచి 7వేల వరకు ఉంటోంది. దేశవ్యాప్తంగా నిమ్మకాయలకు బాగా డిమాండ్ ఉండటంతో న్యూఢిల్లీ, జైపూర్, ఆగ్రా, లక్నో, గోరఖ్‌పూర్, గయా, పాట్నా, రాంచీ, బిహార్, చెన్నై, కోయంబత్తూర్ ప్రాంతాలకు పొదలకూరు మార్కెట్ నుంచే ఎగుమతి చేస్తున్నారు. ఎండలు, పర్వదినాల నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేదు. ఇటీవల తుఫాన్‌ల ప్రభావంతో ఉత్పత్తి తగ్గడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. నిమ్మకాయలు అత్యధికంగా ఎగుమతి చేసే పొదలకూరు, ఉమ్మడి జిల్లాలోని గూడూరు ప్రాంతాల్లో దిగుబడి బాగా పడిపోయింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణం. దీంతో నాణ్యమైన కాయలు మార్కెట్‌కు సక్రమంగా రావడంలేదు. ఈ కారణంగా నిమ్మ పిందెలకు కూడా డిమాండ్ ఏర్పడింది.



సూర్య, చంద్రప్రభలపై వెంకయ్య వైభోగం

వెంకటాచలం : గొలగమూడిలో వెలసిన అవధూత వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా వెంకయ్య స్వామి సోమవారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగారు. వేకువజాము నుంచే స్వామివారికి వివిధ రకాల సేవలను చేసిన అర్చకులు 10 గంటల నుంచి సూర్యప్రభ వాహన సేవకు ఉత్సవర్లను సిద్ధం చేశారు. ఆదిత్యుడిపై కొలువుదీరిన స్వామివారిని గొలగమూడి గ్రామ వీధుల్లో ఊరేగించారు. రాత్రి చల్లని వెన్నెలలో వెంకయ్యస్వామి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సన్నాయి వాయిద్యాల నడుమ 'ఓం నారాయణ.. ఆదినారాయణ' అంటూ భక్తుల భజనల నడుమ విహరించారు. గ్రామస్థులు స్వామివారిని గడప గడపలోనూ ఆపి కర్పూర హారతులు అందచేశారు.

● ఉత్సవాల్లో నేడు

ఆరాధనోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం ఉదయం హనుమంత సేవ, రాత్రి హంస వాహన సేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.



చంద్రప్రభ వాహనంపై వెంకయ్య స్వామి

సూర్యప్రభ వాహనంపై కొలువైన వెంకయ్య స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు





పెంచలోనికి లక్ష తులసీ దళార్చన

రాపూరు, ఆగస్టు 19 : శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెంచలకోన క్షేత్రంలో సోమవారం లక్ష తులసీ దళార్చన పూజలు జరిగాయి. పెంచలస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శ్రీవారి నందనవనంలోని కల్యాణ మండలంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి తులసీ దళాలతో పూజించారు. అనంతరం శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో అభిషేకించారు. అనంతరం ఆదిలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సింధూ దంపతులు, ఈవో సాగర్‌బాబు, రాపూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏదోటి కోటి నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, నాయకులు పీర్ల సోమయ్య యాదవ్, వెంకటరమణరెడ్డి, మధురెడ్డి, కండే రమణయ్య, ఆలయాధికారులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయం వద్ద వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

ఇరిగేషన్ అక్రమాలపై
విజిలెన్స్!

నీటిపారుదల శాఖలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. గడిచిన ఐదేళ్లలో నెల్లూరు సెంట్రల్ డివిజన్ పరిధిలో జరిగిన వర్కుల వివరాలు ఇవ్వాలంటూ విజిలెన్స్ ఎస్పీ, ఇరిగేషన్ ఎస్ఈకి లేఖ రాశారు. దీంతో ఇరిగేషన్ శాఖలో కలకలం రేగింది.



నెల్లూరులోని ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ కార్యాలయం

- సెంట్రల్ డివిజన్‌పై విచారణకు ప్రభుత్వం ఆదేశం
- వైసీపీ హయాంలో మంజూరైన, జరిగిన పనులపై ఎంక్వయిరీ
- వివరాలు ఇవ్వాలని లేఖ రాసిన విజిలెన్స్ ఎస్పీ
- టెండర్లు, ఒప్పందాల మార్పులపైనే తొలుత దృష్టి

నెల్లూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు సెంట్రల్ డివిజన్ అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. ఇదంతా డెల్టా డివిజన్ కావడంతో విచ్చలవిడిగా పనులకు అప్రూవల్ తెచ్చుకోవడం, ఆపై పనులు చేయకనే బిల్లులు రికార్డు చేసుకోవడం వైసీపీ నేతలకు అలవాటైపోయింది. కనీసం పూడికైనా తీయండి బాబో.. అంటూ రైతులు ప్రతి సీజన్ ముందూ గగ్గోలు పెట్టినా పట్టించుకున్న నాథు డు లేడు. కానీ పనులు మాత్రం రూ.వందల కోట్లు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇంత మొత్తంలో పనులు ఎక్కడ చేశారని రైతులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పేవారు లేరు. ప్రధానంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, ఎఫ్‌డీఆర్ కింద భారీ దోపిడీ జరిగింది. కాలువల్లో పూడిక తీయకుండానే తీసినట్లుగా, షట్టర్లు ఏర్పాటు చేయకుండానే చేసినట్లు లెక్కలు రాశారు. ఎంబుక్ రికార్డుల్లో లెవల్స్ నమోదు చేయకుండానే బిల్లులు ఆమోదించారు. కోవూరుకు చెందిన ఓ ఇంజనీరింగ్ కంపెనీ పేరుతో సుమారు వంద షట్టర్ల ఏర్పాటుకు అగ్రిమెంటు జరిగింది. కానీ వాస్తవానికి పది కూడా ఏర్పాటు చేయలేదని తెలుస్తోంది. సదరు కంపెనీ జీఎస్టీ వివరాలు చూస్తేనే ఈ విషయం తేటతెల్లమవుతోంది. ఈ దోపిడీ మొత్తాన్ని వైసీపీ నేతలు కేంద్రీకృతం చేశారు. సెంట్రల్ డివిజన్ పరిధిలో ఓఅండ్ఎం, ఎఫ్‌డీఆర్ కింద సుమారు రూ.400 కోట్లకు పైన గత ప్రభుత్వంలో పనులు చేసినట్లు రికార్డులు చూపిస్తున్నారు.

● సోమిరెడ్డి ఫిర్యాదుతో విచారణ

వాస్తవానికి ఆపరేషన్స్ అండ్ మెయిన్‌టెనెన్స్ పనులను కనీసం 60 శాతమైనా చేసేవారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో పనులు చేయకుండానే బిల్లులు పెట్టుకునే పద్ధతికి శ్రీకారం చుట్టారు. అధికారులు కూడా సహకరించడంతో దోపిడీ భారీ స్థాయిలో జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.150 కోట్ల ఓఅండ్ఎం పనుల్లో అవినీతి చోటు చేసుకుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఆ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సెంట్రల్ డివిజన్ పరిధిలో జరిగిన వర్కులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ నెల 24వ తేదీ లోపు ఈ వర్కుల వివరాలన్నింటినీ అందజేయాలని నెల్లూరు విజిలెన్స్ ఎస్పీ, ఇరిగేషన్ ఎస్ఈకి శనివారం లేఖ రాశారు.

గత ప్రభుత్వంలో జరిగిన వర్కుల్లో ఎక్కువగా పది మంది కాంట్రాక్టర్ల పేరు మీదనే జరిగాయి. వీరిపై వైసీపీ నేతలు టెండర్లు వేసుకొని బిల్లులు పెట్టుకున్నారు. అయితే ఇప్పుడు విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించడంతో ఈ కాంట్రాక్టర్లలో గుబులు పట్టుకుంది. విచారణలో అక్రమాలు నిజమని తేలితే ఆ బాధ్యతను అధికారికంగా ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్లే భరించాల్సి ఉంది. దీంతో వైసీపీ నాయకులు చేసిన పాపాలను తాము మోయాల్సి వచ్చేటట్టుందని కొందరు కాంట్రాక్టర్లు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. అదే సమయంలో వైసీపీ నేతల దోపిడీకి ఇరిగేషన్ అధికారులు కూడా బలికాబోతున్నారు. నాడు అది తప్పు అని చెబితే మమ్మల్ని తీవ్రంగా ఇబ్బందులు పెట్టారని, ఈ క్రమంలోనే కొందరిని శ్రీకాకుళం వంటి జిల్లాలకు బదిలీ చేశారని, నాడు తప్పక తప్పులు చేయాల్సి వచ్చిందని ఇంజనీర్లు మథనపడుతున్నారు. ఇలా నాటి వైసీపీ నేతల ధనదాహానికి నేడు అధికారులు, కాంట్రాక్టర్ల మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది.

కాంట్రాక్టర్లు, అధికారుల్లో గుబులు

'డీకేడబ్ల్యూ'లో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

నెల్లూరు (విద్య), ఆగస్టు 19 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం పోషక బిస్కెట్ల తయారీ (ప్రిపరేషన్ ఆఫ్ న్యూట్రిన్ బిస్కెట్స్) అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకత, వాటిలోని పోషక విలువలు తెలియచేసే విధంగా కోర్సు ఉంటుందన్నారు. విద్యార్థినులు వివిధ అంశాల్లో నైపుణ్యాలను నేర్చుకోవడం వలన ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్వయం ఉపాధికి తోడ్పడతాయన్నారు. నైపుణ్యాల ద్వారా ఎంటర్‌ప్రైనర్స్‌గా ఎదిగే అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం కోర్సుకు సంబంధించిన వివరాలు తెలియచేయడంతో పాటు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ ప్రసాద్, లైబ్రేరియన్ డాక్టర్ సీహెచ్ నారాయణరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కోర్సు వివరాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

అర్జీదారులకు తొలగిన ఇక్కట్లు

● సజావుగా వినతుల స్వీకరణ ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 19 : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించేందుకు ప్రజలు ఎదుర్కొన్న బాధలను గత మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'గంటల తరబడి నిలబెట్టేశారు' అనే కథనానికి కలెక్టరేట్ అధికారులు స్పందించారు. గత సోమవారం జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి అర్జీల స్వీకరణ పద్ధతిని పూర్తిగా మార్చేశారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో అర్జీ నెంబరు కోసం ఒకసారి, తిక్కన భవన్‌లో టోకెన్ కోసం మరోసారి గంటల తరబడి వేచి ఉండే విధానంలో మార్పు చేశారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో అర్జీలు సమర్పించకుండా నేరుగా తిక్కన భవన్ పక్కన అర్జీదారుల కోసం ఏర్పాటు చేసి ఉన్న రేకుల షెడ్డులో కలెక్టరేట్ సిబ్బంది అర్జీలకు నెంబర్లు వేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నెంబరు వేసిన వెంటనే అర్జీదారులు నేరుగా తిక్కన భవన్‌లోకి వెళ్లి ఉన్నతాధికారులకు అర్జీలు సమర్పించేలా ఏర్పాట్లు చేశారు. అధికారుల కారు పార్కింగ్‌కు వినియోగిస్తుండిన రేకుల షెడ్‌లో అర్జీదారులు కూర్చోవడానికి ఏర్పాట్లు చేసి అధికారుల వాహనాలను వేరే చోటికి మళ్లించారు. మొత్తం మీద ఆంధ్రజ్యోతి కథనానికి కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టడంతో అర్జీదారులు సోమవారం ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ఐటీడీఏ పీవో పరిమళ తదితరులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో లవన్న

● ఇందుకూరుపేట మండలంలోని స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్టు కంపెనీని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు డీఆర్వో లవన్నకు అర్జీ సర్పించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు కంపెనీ నుంచి కాలుష్యం వస్తుందని, దానిని మూసేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ కంపెనీలో వందలాది మంది పనిచేస్తున్నారని, కంపెనీని మూసేస్తే తమకు ఇబ్బందులు తప్పవన్నారు. కంపెనీ కాలుష్యానికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని కంపెనీ కొనసాగేలా చూడాలని కోరారు.

పేదోళ్ల బియ్యం
నల్లబజారుకు నడక

- కిలో రూ.15 చొప్పున కొనుగోలు.. రూ.22కు విక్రయం
- పొరుగు జిల్లాలతోపాటు చెన్నైకి రవాణా
- పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం



ఇటీవల విలియమ్స్‌పేటలోని ఓ మిల్లులో పట్టుబడిన రేషన్ బియ్యం బస్తాలతో అధికారులు (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 19 : జిల్లాలో టన్నులకొద్దీ పేదల బియ్యం నల్లబజారుకు తరలుతోంది. కొన్నిచోట్ల రేషన్ బియ్యం పట్టుబడినా పైరవీలతో అధికారులు పట్టువిడుపు చందం పాటిస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. కొంత మంది మాఫియాదారులు తమ అనుచరులతో బుచ్చితోపాటు పరిసర మండలాల్లో రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి రైస్‌మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కర్నూలు, నెల్లూరు జిలకర మసూరాలలో కలిపేస్తున్నారు. తాజ్‌మహల్, కర్నూలు ఇలా రకరకాల మసూరాలు పేర్లు ఉండే 25, 30 కేజీల బస్తాలలో నింపి పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. కాగా, బుచ్చిరెడ్డిపాళెంలో ఇద్దరు వ్యక్తులు పలు రేషన్ దుకాణాలతోపాటు లబ్ధిదారుల నుంచి కిలో రూ.15లకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి నెల్లూరులోని రైస్‌మిల్లులు, టిఫెన్ సెంటర్లకు రూ.22లకు అమ్ముకుంటున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బుచ్చి, సంగం, దగదర్తి మండలాలకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, రేషన్ దుకాణాలు మొత్తం 700 టన్నుల బియ్యం సరఫరా అవుతాయి. ఈ 3 మండలాల నుంచి బుచ్చి కేంద్రంగా నెలకు సుమారు 20 నుంచి 30టన్నుల దాకా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్టు సమాచారం.

● విలియమ్స్‌పేట టూ చెన్నై

మండలంలోని నాగమాంబాపురం పంచాయతీలోని విలియమ్స్‌పేటలో ఓ రైస్‌మిల్లు కేంద్రం గా రేషన్ బియ్యం విలియమ్స్‌పేట టు చెన్నై రేషన్ రాకెట్ సాగుతోంది. గత ఏడాది ఆగస్టులో ఓ మిల్లులో 800 బస్తాలకుపైగా (20 టన్నులు) రేషన్ బియ్యం లోడుచేస్తుండగా సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు పట్టుకున్నారు. అదే మిల్లులో ఈ నెల 12న విజిలెన్స్, సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి 326 బస్తాల రేషన్ బియ్యం (12టన్నులు) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తరచూ విలియమ్స్‌పేటలోని ఓ మిల్లు నుంచి రేషన్ బియ్యం చెన్నైకి, అక్కడ నుంచి చెన్నై రేషన్ బియ్యం (ఉప్పుడు బియ్యం) విలియమ్స్‌పేటకు రవాణా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఆ ఉప్పుడు బియ్యాన్ని మిల్లులో రీసైక్లింగ్ చేసి ఇడ్లీ రవ్వకింద అమ్ముతున్నట్టు తెలిసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	123
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	244
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6667
వెండి కిలో ధర	రూ. 83,300
వెండి ఒక గ్రాము	రూ. 85.30

'సోమశిల'లో 24.679 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 11,262 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 24.679 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వారు స్పందించే వరకూ
మా పోరాటం ఆగదు!

- ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి నిర్దిష్టమైన ప్రకటన చేయాలి
- జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ నేతలు
- జూడాలకు మద్దతు ప్రకటించిన పలు సంఘాల నేతలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 19 : కోల్‌కతాలో శిక్షణ వైద్యురాలి హత్యాచార ఘటనపై నెల్లూరులోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ల ఆందోళన కొనసాగుతోంది. ఓపీ సేవలు నిలిపివేసి వివిధ రకాలుగా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. వైద్యురాలిపై అఘాయిత్యం జరిగి 10 రోజులైనా నిందితులను పట్టుకోవడంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని జూడాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని జూనియర్ వైద్యుల సంఘం డిమాండ్ చేస్తోంది. ఈ ఘటనపై అన్ని వర్గాలు ఆందోళన చేస్తుంటే బెంగాల్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా స్పందించి కోల్‌కతా ఘటనపై నిర్దిష్టమైన ప్రకటన చేయాలని జూడాలు డిమాండ్ చేస్తున్నారు. అంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రొఫెసర్ కలేషాబాషా ఆధ్వర్యంలో జూడాలు చేపట్టిన సమ్మెకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మద్దతు ప్రకటించారు. అలాగే రామచంద్రారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దత్తాత్రేయ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నేతలు తరలివచ్చి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జూనియర్ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీరస్ జోయల్, కార్యదర్శి డాక్టర్ హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉత్తమ్‌కుమార్, డాక్టర్ రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ అబిద్ అహ్మద్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో సమ్మె చేస్తున్న జూనియర్ వైద్యులు

23న ఉపాధి హామీ
గ్రామసభలు

వరికుంటపాడు, ఆగస్టు 19: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23న ఉపాధిహామీ పథకం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల చౌదరి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నూతనంగా చేపట్టాల్సిన పనుల ఆమోదానికి గ్రామసభల్లో తీర్మానాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ హసీనిస్సి, ఈవోపీఆర్డీ సికిందర్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంలో
మట్టి అక్రమ తవ్వకాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 19: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ అంబేడ్కర్ నగర్ రేబాలకు వెళ్లే రోడ్డు వద్ద సోమవారం ఓ లేఔట్‌లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. అందిన సమాచారంతో నగర కమిషనర్ అక్కడికి వెళ్లేసరికి పరారయ్యారు. దీంతో మట్టి తవ్వకాలకు అడ్డుకట్టపడింది.

లక్ష ఎకరాలకుపైగా
ఆయకట్టు బదలాయింపు

- అయినా పాత ఆయకట్టు పరిధిలోనే సోమశిల నీటి కేటాయింపులు
- ఇదెక్కడి న్యాయమంటున్న కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల రైతులు
- ఎమ్మెల్యే వాదనకు మద్దతు

జలదంకి, ఆగస్టు 19: సోమశిల ఆయకట్టులో భూబదలాయింపు జరిగినా, ఆయకట్టు స్థిరీకరణ జరగలేదు. డెల్టా, నాన్‌డెల్టా పేరుతో జలాశయం పరిధిలోని ఆయకట్టును విభజించి ఆ మేరకు నీటి కేటాయింపులు చేస్తున్నారు. ఆయకట్టు స్థిరీకరణపై కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల రైతులు ఎన్నో ఏళ్లుగా సోమశిల జలాశయ అధికారులతో మొత్తుకుంటున్నారు. కానీ వారి విన్నపాలను పెడచెవిన పెడుతూ డెల్టాకు అధికంగా రెండు పంటలకు సాగునీటి కేటాయింపులు చేపడుతున్నారు. నాన్‌డెల్టా పేరుతో కావలి, ఉదయగిరి, కందుకూరు ప్రాంతాల ప్రజలకు తాగు, సాగునీటి కేటాయింపులో అన్యాయం జరుగుతోంది. ఇకనైనా సోమశిల జలాశయం అధికారులు ప్రాజెక్ట్ ఆయకట్టు స్థిరీకరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆయకట్టు పరిధిలో ఉన్న గ్రామాలు, పట్టణాలు, నెల్లూరు నగర పరిధిలో భూబదలాయింపు (ల్యాండ్ కన్వర్షన్) జరిగిన వాటిని ఆయకట్టు నుంచి తొలగించాల్సి ఉంది. కొత్త ఆయకట్టును స్థిరీకరించి జిల్లాలో పంటసాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఉంది.



సాగుభూమిని గుర్తించాలి

కావలి కాలువ కింద వరిసాగుకు అనుకూలమైన భూములు ఉన్నా, ఎన్నడూ కావలి కాలువ పూర్తి ఆయకట్టులో పంట పండలేదు. ఇకనైనా సాగుభూమిని గుర్తించి నీటి కేటాయింపులు చేపట్టాలి. జడ్పీలో కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి వాదన సబబే.

- కండ్లగుంట మధుబాబు నాయుడు, సోమశిల ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్



ఆయకట్టును స్థిరీకరించాలి

సోమశిల ప్రాజెక్ట్ ఆయకట్టును స్థిరీకరించాలని ఉదయగిరి, కావలి నియోజకవర్గాల రైతులు ఎన్నోఏళ్ల నుంచి డిమాండ్ చేస్తూనే ఉన్నారు. పలు ఐఏబీ సమావేశాల్లో కూడా అధికారులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఫలితం కనిపించలేదు. జడ్పీ సమావేశంలో కావలి ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి లేవనెత్తిన వాదన సరైందే. ఇకనైనా అధికారులు కళ్లుతెరిచి ప్రాజెక్ట్ ఆయకట్టును స్థిరీకరించాలి.

- చేవూరి పాపిరెడ్డి, కావలి కాలువ డిస్ట్రిబ్యూటరీ మాజీ చైర్మన్

● జడ్పీ సమావేశంలో చర్చ

ఇటీవల నెల్లూరులో జరిగిన జడ్పీ సమావేశంలో కావలి ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సోమశిల జలాశయ ఆయకట్టు స్థిరీకరణ చేయాలని కోరారు. దీంతో మూడు నియోజకవర్గాల రైతులు ఆయనకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ నియోజకవర్గాల పరిధిలో సోమశిల జలాశయం నుంచి సాగు, తాగునీరు అందే అవకాశం ఉన్న గ్రామాలు, పట్టణాల్లో ఏ రచ్చబండపైన చూసినా కావలి ఎమ్మెల్యే వాదన సరైందని పేర్కొన్నడాన్ని బట్టి చూస్తే ఈ ప్రాంత ప్రజలకు సోమశిల జలాల పంపిణీలో ఎంత అన్యాయం జరుగుతుందో అర్థమవుతోంది.

● మాకు అన్యాయం : రైతులు

ఆయకట్టు విషయంలో తమకు అన్యాయం జరుగుతోందని కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల రైతాంగం వాపోతోంది. ఉదాహరణకు నెల్లూరుటౌన్, రూరల్, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో జలాశయం ప్రారంభంలో (1989) ఉన్న ఆయకట్టు విస్తీర్ణం నేటికీ చూపుతూ ప్రతి ఏటా రెండుపంటలకు సాగునీటి కేటాయింపులు చేస్తున్నారు. గత ఏడాది విషయానికొస్తే ఖరీఫ్, రబీ రెండు పంటలకు ఆయా నియోజకవర్గాల ఆయకట్టుకు సాగునీరు కేటాయించారు. కానీ కావలి కాలువ విషయానికి వచ్చే సరికి ఖరీఫ్‌లో అసలు కేటాయింపులు చేయలేదు. రబీలో కూడా రైతులు, రాజకీయ నాయకులు, రైతుసంఘాల నేతలు ఉద్యమాలు చేస్తే ఆలస్యంగా 50 వేల ఎకరాలకు మాత్రమే సాగునీటి కేటాయింపులు చేశారు. ఆ నీరు కూడా అదును దాటిన తరువాత విడుదల చేసిన కారణంగా పంట దిగుబడులు భారీగా తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా సరైన ప్రణాళికతో ఆయకట్టును స్థిరీకరించి తమకు న్యాయం చేయాలని కావలి కాలువ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● లక్ష ఎకరాలపైగా భూమార్పిడి

ప్రస్తుతం సోమశిల జలాశయం ఆయకట్టు 5.84లక్షల ఎకరాలు ఉండగా, ఇందులో లక్ష ఎకరాలకుపైగా ఆయకట్టులో ఉన్న సాగుభూమిని వివిధ ప్రజావసరాల నిమిత్తం మార్పు చేశారు. అయినా ఆ భూమి కూడా జలాశయం ఆయకట్టులో ఉన్నట్లు చూపిస్తూ సాగునీటి కేటాయింపులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వే చేపట్టి ఆయకట్టును స్థిరీకరించే దిశగా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మూడు నియోజకవర్గాల రైతులు కోరుతున్నారు.

ఎస్వీపీఎం కాలువ
రెగ్యులేటర్ల వద్ద
దెబ్బతిన్న షట్టర్లు

అవస్థలు పడుతున్న రైతులు | పట్టించుకోని అధికారులు

బిట్రగుంట, ఆగస్టు 19: ప్రతి ఏటా సాగునీటి కోసం రైతన్నలు ఇబ్బందులు పడుతున్నా సోమశిల అధికారుల్లో కాస్తంత కూడా చలనం లేదు. కావలి కాలువకు అనుసంధానంగా ఉన్న శ్రీవెంకటేశ్వర పాలెం మేజరు (ఎస్వీపీఎం) కాలువ, దామవరం మైనరు కాలువల షట్టర్లు పూర్తిగా దెబ్బతిని సాగునీరు వృథాగా పోతున్నది. అయినా వారు పట్టించుకున్న పాపానపోలేదు. సుమారు 40 ఏళ్ల క్రితం కాలువలకు ఏర్పాటు చేసిన షట్టర్లు పూర్తిగా దెబ్బతిన్నా యి. ఎస్వీపీఎం కాలువకు ఏర్పాటు చేసిన మూడు తూముల షట్టర్లు, దామవరం కాలువ రెండు షట్టర్లు, దిమ్మెలు పడిపోయి రెండేళ్లు అయింది. దీంతో పొలాలకు సక్రమంగా సాగునీరు అందడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



కంపచెట్లు, తుంగతో మూసుకు పోయిన ఎస్వీపీఎం కాలువ

● గతంలో తాత్కాలిక మరమ్మతులు

2016-17లో టీడీపీ ప్రభుత్వం కొన్ని షట్టర్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరు అందించింది. 2019 తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం షట్టర్ల విషయాన్ని పట్టించుకోలేదు. కంపచెట్లు, తుంగతో కాలువలు మూసుకుపోయాయి. కాలువల్లో పూడికతీత, చేపట్టాల్సిన సోమశిల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎస్వీపీఎం కాలువకు పరిస్థితులను బట్టి 120 నుంచి 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుంటారు. దెబ్బతిన్న షట్టర్ల ద్వారా సాగునీరు కొంత వృథా పోతుండగా, కాలువల్లో పూడిక తీయక ప్రవాహానికి ఆటంకంగా ఏర్పడుతున్నది. దీంతో పంటలకు నీరు సరిపోక రైతులు అగచాట్లు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీ నాయకులు ఎస్వీపీఎం కాలువలో నామమాత్రంగా తుంగ తొలగింపు చేపట్టారు. అది కూడా రెగ్యులేటరు నుంచి నాగుల వరం వరకు మాత్రమే. వర్షాలు కురవకముందే కాలువల్లో పూడికతీత చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఎస్వీపీఎం కాలువ కింద సుమారు 20 వేల ఎకరాలు, దామవరం మైనరు కాలువ కింద రెండువేల ఎకరాలకు పైచిలుకు ఆయకట్టు ఉంది. షట్టర్ల మరమ్మతులు వెంటనే చేపట్టకపోతే ఈ ఏడాది కూడా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. సోమశిల అధికారులు వెంటనే స్పందించి షట్టర్ల మరమ్మతులు, కాలువల్లో పూడికతీత చేపట్టాలని టీడీపీ జిల్లా రైతు నాయకుడు కాండ్ర రఘురామనాయుడు డిమాండ్ చేశారు.



తూము దిమ్మె దెబ్బతిని పడిపోయిన షట్టర్

బస్‌షెల్టర్ల ఊసేలేదు!


జిల్లా వైద్యశాల ఎదుట రోడ్డుపైన ఉన్న పయాణికులు

ఆత్మకూరు, ఆగస్టు 19: పట్టణం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. చుట్టుపక్కల 80గ్రామాలకు ప్రధాన కూడలిగా ఆత్మకూరు ఉంది. 30కిపైగా పాఠశాలలు ఉన్నాయి. ప్రతి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి 5వేల మందికిపైగా ప్రజలు వివిధ పనుల మీద ఆటోలు, బస్సుల్లో పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఆత్మకూరు ప్రధానకూడళ్లలో సంబంధిత అధికారులు బస్‌షెల్టర్ల నిర్మాణం చేప ట్టలేదు. ఈ సమస్యతో ప్రయాణికులకు నిలువ నీడ కరువై చెట్ల కింద, వ్యాపార సముదాయాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. మరికొన్ని కూడళ్ల వద్ద రోడ్డుపైనే ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

షెల్టర్లు లేని కొన్ని ప్రధాన కూడళ్లు ఇవే..

- పట్టణంలోని వైద్యశాలకు ఎదురుగా బస్ షెల్టర్ లేదు. వివిధరకాల రోగాలతో వైద్య సేవలకు వచ్చేవారు ఎండలో రోడ్డుపైనే నిలబడుతున్నారు.
- బీఎస్‌ఆర్ సెంటర్, సోమశిల రోడ్డు సెంటరు, నాగులపాడు రోడ్డు సెంటరు, జాతీయ రహదారికి పక్కనే ఉన్న నెల్లూరుపాళెం, ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సెంటర్లలో బస్సుషెల్టర్లు లేవు.
- పట్టణ ప్రధాన కూడళ్లలో మోడల్ బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

● అట్టహాసంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: కృష్ణంపల్లి సీతారామచంద్ర ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమవారం గ్రామ పురవీధుల్లో స్వామి వారిని హనుమంతు వాహనంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారి వాహనం వెంట వారుకడవతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎద్దులు బండలాగుడు పోటీల్లో ఆరు జతలు పాల్గొన్నాయి. వీటిలో ప్రథమస్థానంలో కడప జిల్లా రంగసానిపల్లికి చెందిన మార్తాల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు, ద్వితీయస్థానంలో అదే జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన మూలె సూరారెడ్డి ఎద్దులు, తృతీయస్థానంలో కడప జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన మూలె ప్రసాద్‌రెడ్డి, కుమ్మరకొట్టాలకు చెందిన రఫీ ఎద్దులు నిలిచాయి. ఆలయ నిర్వాహకులు విజేతలకు రూ.40,116 వేలు, రూ.30,116వేలు, రూ.20.116వేల చొప్పున నగదును అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మిగిలిన ఎద్దుల నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతి కింద ఒక్కొక్కరికి రూ.10వేలు అందజేశారు. పోటీలను తిలకించేందుకు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


బండలాగుతున్న ఎద్దు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

● రూ.లక్ష నష్టం ● బాధితులకు బీజేపీ నేతల సాయం

ఏఎస్ పేట, ఆగస్టు 19: గుంపార్లపాడు ఎస్టీ కాలనీకి చెందిన యాకసిరి వెంకటరమణయ్య, చెంచులక్ష్మి దంపతుల పూరిగుడిసె సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిబుడిదైంది. ఈ విషయం గుర్తించిన వారు తేరుకొని బయటకు పరుగుల తిని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ లోగా మంటలు పూర్తిగా వ్యాపించడంలో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంటిలో ఉన్న వస్తువులు, నిత్యావసర సరుకులతో సుమారు రూ.లక్ష ఆర్థికనష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. విషయం తెలుసుకున్న బీజేపీ మండలాధ్యక్షుడు చెంచులరెడ్డి, ఉపాధ్యక్షుడు సిరిగిరి మహేష్‌లు బాధితులను పరామర్శించి 15రోజులకు సరిపడ నిత్యవసర సరుకులను అందజేశారు. తహసీల్దారుతో మాట్లాడి ఎన్‌టీఆర్ గృహకల్ప పథకం కింద నూతన గృహం మంజూరు చేసేందుకు కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

హనుమంతుడి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ


భూమిపూజలో పాల్గొన్న గ్రామస్థులు

సంగం, ఆగస్టు 19: అమరపనాయుడు కండ్రిక సమీపంలోని ల్యాంకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి వెళ్లే రహదారి కూడలిలో హనుమంతుడి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకురాలు లగడపాటి రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య భూమి పూజ చేశారు. 20అడుగుల విగ్రహంతోపాటు ప్రయాణికుల బస్‌షెల్టర్ కూడా నిర్మించనున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: రాఖీ పర్వదినాన్ని సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సోదరులు వారికి కానుకలను అందజేశారు. నడింపల్లి నాగా రప్పమ్మ కొలుపు కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్నలకు స్థానిక మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


చెంచలబాబుకు రాఖీ కడుతున్న టీడీపీ మహిళ నాయకురాలు

వరికుంటపాడు: గ్రామాల్లో పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న వారు స్వగ్రామాలకు చేరుకొని తన అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టారు. సోదరులు అక్కా, చెల్లెళ్లకు అన్ని వేళలా అండగా ఉంటామంటూ భరోసా కల్పించి బహుమతులు అందజేశారు.

రాజరాజేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు

సంగం, ఆగస్టు 19: స్థానిక తిరుమనకొండలో వెలసిన రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో కలశ స్థాపన, షోడశ లక్ష్మీనారాయణ, కుంకుమార్చన, లలితాయజ్ఞంను నిర్వహించారు. భక్తులు హోమంలో పూర్ణాహుతి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వింజమూరు: నడిమూరు గురప్పస్వామి, అంకాలమ్మ అమ్మవారు, నాగవరపు అమ్మవారికి సోమవారం గురువారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పసుపులేటి శివశంకర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు ఉదయాన్నే పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ర్యాగింగ్ నిరోధక వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక మేకపాటి గౌతం రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జూనియర్, సీనియర్ అనే బేధం లేకుండా విద్యార్థులంతా కలిసిమెలిసి విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. ర్యాగింగ్ చేయడం మంచి విద్యార్థుల లక్ష్యం కాదన్నారు. ర్యాగింగ్ చేస్తే ఇబ్బందులకు గురవుతారని, ఏ విద్యార్థి అలాంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ యాక్ట్‌పై విపులీకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రమేష్, ప్రొఫెసర్లు కిషన్‌తేజ, హీన, పాల్, వార్డెన్‌లు సునీత, బాలచందర్ పాల్గొన్నారు.

1982 మోడల్ జీపు వేలానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోని 1982 మోడల్ ప్రభుత్వ జీపుకు ఉన్నతాధికారుల సూచన మేరకు వేలం నిర్వహించనున్నట్లు సీడీపీవో పచ్చవ లావణ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు 21 నుంచి 30లోపు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి పేరున రూ.300డీడీతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలు నిలిపివేయండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలు నిలిపివేయాలని మండల ఆవాజ్ కమిటీ సభ్యులు సోమవారం డిప్యూటీ తహసీల్దారు జహీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టాలను మార్చేందుకు ఇటీవల బిల్లులను ప్రవేశపెట్టారని, ముస్లింలోని పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఎవరైతే భూములు ఇచ్చారో వారి లక్ష్యాలకు అనుగుణంగా ఈ బిల్లు లేదన్నారు. రాజ్యాంగంలోని మతస్వేచ్ఛ ఆర్టికల్స్ 25, 26, 27, 28లకు ఈ బిల్లు వ్యతిరేకమన్నారు. కావున ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు ఫరుద్దీన్‌బాషా, నాయబ్, మహ్మద్‌రఫీ, హుసేన్, షబ్బీర్, నాగేశ్వరరావు, రసూల్, నజీర్ పాల్గొన్నారు.


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతికార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంచలయ్య కోరారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు నెల్లూరు వెంకటస్వామినాయుడు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరం గారావు, చల్లా సుబ్బరత్నం, షాజహాన్ పాల్గొన్నారు.

మిఠాయిలు, పండ్ల పంపిణీ


విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న మండల ఏవో రేణుక

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: శుభ్‌దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక దళితవాడ పాఠశాలలో సోమవారం ప్రధానో పాధ్యాయుడు షబ్బీర్ మనవరాలు మన హాతబస్సమ్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. దాతలు కార్యక్రమానికి సహ కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ ఏవో రేణుక, విశ్రాంత హెచ్‌ఎం సయ్యద్ కలీం, ఉపాధ్యాయు లు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ



కలువాయి, ఆగస్టు 19: కోల్‌కతాలో మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా సోమవారం శివసాయి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండులో మానవహారంగా ఏర్పడి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు సరళకుమారి, మనస్వి, నాయకులు దండు పెంచలయ్య, ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞాపకమే ఫొటో

నెల్లూరు(వైద్యం) : కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞానకాలే ఫొటో అని ఫొటోగ్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొంతు శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీహెచ్‌పీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ నిర్మాణ కర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పీహెచ్‌పీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు షేక్ సత్తార్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, శ్రీలక్ష్మి స్టూడియో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులపై వినతి

కలువాయి, ఆగస్టు 19: స్థానిక చెరువు రెండు తూములతో పాటు ప్రధాన పంట కాలువకు మరమ్మతులు చేపట్టాలని రైతులు సోమశిల సీఎం ప్రజావేదికలో సీఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేశారు. రెండు తూములు దెబ్బతిని నీరు లీకేజీ అవుతుందని, ఈ సమస్యతో పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

ఏఎస్ పేట, ఆగస్టు 19: త్రైత సిద్ధాంతం ఇందూజ్ఞాన వేదిక ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ సభ్యులు శ్రీకృష్ణజన్మాష్టమి ఊరేగింపు విశిష్టతపై సోమవారం చారమణలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య, సభ్యులు పెంచలయ్య, శేషాద్రి, సుధాకర ఆచారి, జాహ్నవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని 4వార్డు పసుపులేటి వేణు, 9వ వార్డు రాగి వెంకటమ్మ, పోకూరు లక్ష్మమ్మ, 8వార్డు పఠాన్ నసీబలు ఇటీవల మరణించారు. వారి కుటుంబాల సభ్యులను సోమవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి కలిసి పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున రూ.40వేలను అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కుదుముల సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పార్కింగ్ ఇలా... రాకపోకలు ఎలా ?

కావలి,ఆగస్టు 19 : పట్టణంలోని క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో అన్నీ ప్రైవేట్ వైద్యశాలలు, విద్యాసంస్థలతోపాటు పలు వ్యాపారసంస్థలు ఉన్నాయి. విద్యాసంస్థలు వదిలిన తర్వాత ఇసుక వేస్తే రాలనంత రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో వైద్యశాలలకు వెళ్లే రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ట్రాఫిక్ సమస్యను పోలీసులు గాలికి వదిలేశారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ రోడ్డుపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

శంకుస్థాపన జరిగినా ప్రారంభం కాని పనులు

లింగసముద్రం, ఆగస్టు 19 : శంకుస్థాపన జరిగి ఆరు నెలలు దాటినా, మండలంలోని తిమ్మారెడ్డిపాలెం- అయ్యవారిపల్లిరోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాలేదు.దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన కింద తారురోడ్డు నిర్మాణానికి కేంద్రం రూ.7.77 కోట్లు మంజూరు చేసింది..తిమ్మారెడ్డిపాలెం నుంచి వెంగళాపురం మీదుగా ఎర్రారెడ్డిపాలెం, ఉట్లవారిపాలెం, అయ్యవారిపల్లి వరకు 10.2కి.మీ దూరం తారురోడ్డు నిర్మాణంతోపాటు 13 చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.అయితే ఈ పనులకు 2023 నవంబరు 16న టెండర్లు జరగ్గా, 2024 ఫిబ్రవరి 22న కాంట్రాక్టరు అగ్రిమెంటు చేశారు. అదేనెల 24న పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు.ఈ పనులను కాంట్రాక్టరు 21.02.2025 ఫిబ్రవరి 21కి పూర్తి చేయాల్సి ఉంది.కానీ నేటికీ ప్రారంభించలేదు. త్వరగా ప్రారంభించేం దుకు చర్యలు తీసుకుంటామని పీఆర్ ఏఈ ఏ హనుమంతరావు చెప్పారు.


అభివృద్ధికి నోచని తిమ్మారెడ్డిపాలెం రోడ్డు

సీఎం దృష్టికి కావలి, కందుకూరు సాగునీటి సమస్యలు

కావలి, ఆగస్టు19: నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సోమశిలను సందర్శించటానికి సోమవారం వచ్చిన సీఎంకు బొకే అందచేసి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గ సాగునీటి సమస్యలను తెలియచేస్తూ వినతిపత్రం అందచేశారు. డెల్టా ప్రాంతంలో చాలావరకు ఆయకట్టు భూముల్లో పలు నిర్మాణాలు చేపట్టడంతో అక్కడ సాగు విస్తీర్ణం తగ్గిందని, నాన్ డెల్టాలో వ్యవసాయానికి అనుకూలమైన భూములు ఉండటంతో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ప్రస్తుత సాగును బట్టి ఆయకట్టు స్థిరీకరణ చేయాలని కోరారు.


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సీఎంకు సాగునీటి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

● రాళ్లపాడు రైతులను ఆదుకోవాలి

కందుకూరు : నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందిస్తున్న రాళ్లపాడు ప్రాజెక్టుకు నీటిసమస్యను తీర్చి, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సోమశిలకు వచ్చిన సీఎంను కలిసి సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడు రిజర్వాయరుకు ఇవ్వాల్సిన 1.5 టీఎంసీల నీటిని ప్రతిఏటా క్రమం తప్పకుండా అందించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అండజేసినట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాక రాళ్లపాడు రిజర్వాయరు గేట్ల నిర్వహణ, పంట కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని, రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనులకు నిధులు విడుదల చేయాల్సిన అవసరాన్ని సీఎంకి వివరించామన్నారు. ఈ సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పూర్తికి ప్రతిపాదనలు పంపాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారని ఇంటూరి ఈ సందర్భంగా తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం, ఆగస్టు 19: మండలంలోని అన్నెబోయినపల్లి సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి మన్నేరు వాగులో ఇసుక నింపుకుంటున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని, అపరాధ రుసుం విధించేందుకు ఈ కేసును నెల్లూరు మైనింగ్ అధికారులకు బదిలీ చేశామని ఎస్సై తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్

కందుకూరు, ఆగస్టు 19: రక్షాబంధన్ వేడుకలను సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అనేక మంది సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల, నాగార్జున పబ్లిక్ స్కూల్, విజ్ఞాన్ విహార్ తదితర పాఠశాలల్లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు.


కందుకూరు : విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

కొండాపురం: రాఖీ పండగను మండల పరిధిలోని అన్నీ గ్రామాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి, స్వీట్లు తినిపించుకున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న వారికి పోస్టులు రాఖీలు పంపి పండుగ జరుపుకున్నారు.

'ఉపాధి'లో అవినీతిపై నిగ్గుతేల్చండి

కలిగిరి, ఆగస్టు 19: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినీతి చోటుచేసుకున్నదని, ఈ విషయమై పూర్తి స్థాయిలో నిగ్గుతేల్చాలని టీడీపీ రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు డిమాండ్ చేశారు. 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బహిరంగ విచారణ జరిగింది. ఈ సందర్భంగా పెదకొండూరు, చినఅన్నలూరు, గంగిరెడ్డిపాలెం, కావలిముస్తాపురం, రావులకొల్లు, ఏపినాపి గ్రామాల్లో పంచాయతీల తీర్మానాలు లేకుండా చేపట్టిన పనులపై ఏపీవో శ్రీనివాసులుతో సర్పంచులు వాగ్వాదానికి దిగారు. తీర్మానాలపై సంతకం లేకుండా చేపట్టిన పనులపై ఫిర్యాదుచేశారు. మొత్తం 23 పంచాయతీల ఆడిట్ పూర్తికావడానికి అర్ధరాత్రి వరకు సమయం పట్టవచ్చని, పూర్తి వివరాలు మంగళవారం వెల్లడిస్తామని ప్రిసైడింగ్ అధికారిణి వీ విజయలక్ష్మి తెలిపారు.


ఏపీవోపై ఫిర్యాదు చేస్తున్న సర్పంచులు

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సీఐ

కావలి రూరల్, ఆగస్టు19: రూరల్ సీఐగా జీ. రాజేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంటిలిజెన్స్ విభాగంలో చిలకలూరిపేట సీఐగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కాటూరి శ్రీనివాసరావు గుంటూరు వీఆర్‌కు బదిలీ అయ్యాడు. కాగా బదిలీపై వెళ్తున్న సీఐ శ్రీనివాసరావును డీఎస్పీ వెంకటరమణ, రెండవ పట్టణ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రాజేశ్వరరావు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

శ్రావణ పౌర్ణమికి ప్రత్యేక పూజలు

కందుకూరు, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని జనార్దన, స్కంధపురి సోమేశ్వరాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న విఖనసమహర్షి మూలమూర్తికి వైభవంగా స్నపన తిరుమంజనాది కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం రాత్రి వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు.


కందుకూరు : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

● విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

బిట్రగుంట : బోగోలు మండలం సుందగిరివారికండ్రికలో సోమవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా చిల్లకూరుకి చెందిన సిద్ధాంతి బ్రహ్మశ్రీ ఈపూరు గోవిందరాజు ఆచారి, బృందం దిష్టితుడుపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన పూజలు నిర్వహించారు.

మొబైల్ రీచార్జి ధరలు తగ్గించాలి


మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కావలిటౌన్ : మొబైల్ రీచార్జి ధరలు తగ్గించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ళూరు మాల్యాద్రి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జియో, ఎయిర్‌టెల్, తదితర కంపెనీలు ముందుగా తక్కువ ధరకే కనెక్షన్లు ఇచ్చుకుని, తీరా ప్రజలు అలవాటు పడ్డాక రీచార్జి ధరలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికైనా సామాన్యులను దృష్టిలో పెట్టుకుని చార్జిలు తగ్గించాలని కోరారు. సమావేశంలో ఎం రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలి

కావలి : ప్రభుత్వ గ్రంథాలయానికి స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని బీసీ ఐక్యతా భవన్ అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం అందచేశారు.అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ గ్రంథాలయం అద్దె భవనంలో ఉండటంతో తరచూ భవనాన్ని మారుస్తుండటంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్థలం మంజూరు చేసినా భవన నిర్మాణానికి దాతలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, బీసీ ఐక్యతా భవన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యూ.గోవింద్,ఇతర బాధ్యులు మధు, ఏ. శ్రీనివాసులు, చిన్ని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్‌ల ఆగడాలు అరికట్టాలి

కావలి, ఆగస్టు19: పేదల ఉసురు తీస్తున్న ప్రైయివేట్ ఫైనాన్స్‌ల ఆగడాలను అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ ఫైనాన్స్ వారు, తండల వ్యాపారులు, ప్రైవేట్ బ్యాంకర్లు పేదవారికి అధికవడ్డీలకు అప్పులు ఇస్తూ వారిని వేధింపులకు గురి చేస్తున్నార న్నారు. వారి ఆగడాల నుంచి పేదలకు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, జరుగుమల్లి విజయరత్నం, శ్రీనివాసులు, వెంకటస్వామి, లక్ష్మీనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు వితరణ

కొండాపురం : మండలంలోని దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం మినరల్ వాటర్ ప్లాంటును వితరణ చేశారు.హెచ్‌ఎం ఐ.బాలక్రిష్ణయ్య,ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ఓర్స్ మమత, సభ్యులు వల్లూరి వెంకటేశ్వర్లు కోరిక మేరకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఇర్ల మహేష్ రూ.80 వేల విలువచేసే వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల తాగునీటి సమస్య తీరుతుందని హెచ్‌ఎం అన్నారు. ఈ సందర్భంగా దాత మహేష్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

లోడ్ పెరగడంతోనే విద్యుత్ లోవోల్టేజీ సమస్య

బిట్రగుంట : విద్యుత్ కనెక్షన్ల లోడ్ పెరగడం తోనే ఓల్టేజీ సమస్య ఏర్పడిందని విద్యుత్ ఏఈ నాగూరువల్లి తెలిపారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో ఓల్టేజీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలియచేయడంతో ఆయన సోమవారం పరిశీలించారు. టౌన్‌లైన్‌మన్ రమేష్‌బాబు, జేఎల్‌ఎం ఏలియాలతో లైన్, ట్రాన్స్‌ఫార్మర్ అవుట్ ఫుట్‌ను పరిశీలించారు. అదనపు గృహోపకరణాల వినియోగం కారణంగా సమస్య ఏర్పడినట్లు గుర్తించారు. త్వరలో అదనపు త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

పూర్తికాని క్రీడా కేంద్ర భవన నిర్మాణం

● నిధులు కేటాయించని వైసీపీ ప్రభుత్వం ● ఇబ్బందుల్లో క్రీడాకారులు



అసంపూర్తిగా ఉన్న క్రీడా కేంద్ర భవనం

విడవలూరు, ఆగస్టు 19: క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చేపట్టిన క్రీడా కేంద్ర భవన నిర్మాణం ఏళ్ళు తరబడి అసంపూర్తిగా ఉండడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. విడవలూరులో క్రీడాకేంద్రాన్ని ఏర్పాటుచేస్తే చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుందని 2018 సంవత్సరంలో అప్పటి కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రస్తుత టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్యల సహకారంతో సుమారు రూ. 2.25 కోట్ల వ్యయంతో విడవలూరు హైస్కూల్‌లో క్రీడా కేంద్రానికి శంకుస్థాపన చేశారు. నిధులు పుష్కలంగా విడుదల కావటంతో పనులు శరవేగంగా జరిగాయి. దాదాపు 40 శాతం మేర భవన నిర్మాణ పనులు జరిగాయి. అనంతరం ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించక పోవడంతో భవన నిర్మాణ పనులు పూర్తిగా అటకెక్కాయి. సుమారు ఆరేళ్లుగా పనులు జరగలేదు. దీంతో భవనం చుట్టూ పిచ్చిచెట్లు పెరిగి పాములు చేరి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని క్రీడా కేంద్రాన్ని పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



అవగాహన కల్పిస్తున్న సుధాకర్‌రావు

ఇందుకూరుపేట, ఆగస్టు 19: మండలంలోని పల్లిపాడులో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు, డాక్టర్ కిషోర్‌కుమార్ సూచనలతో సోమవారం అనీమియా రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శించారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేటర్ చేజర్ల సుధాకర్‌రావు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడం, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి బిడ్డ క్షేమంగా ఉండి మాతాశిశు మరణాలు నివారించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎండీ జిలానీబాషా, సీహెచ్ఓ పీ కమల, ఏఎన్ఎం దేవకుమారి, 104 సిబ్బంది లక్ష్మణ్ సుల్తాన్, ఆశా వాలంటీర్లు వనజ పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం



కోవూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కోవూరు, ఆగస్టు 19: శారీరక, మానసిక ఆరోగ్యం కోసం నడక జీవితంలో తప్పనిసరి కావాలని వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి బీ మధుసూదనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నూతనంగా కోవూరు వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. కార్యదర్శిగా ఎన్నికైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నడకతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. వీ రామమోహనరెడ్డి అధ్యక్షునిగా పదిమందితో నూతన కమిటీ ఏర్పాటైంది.

కమిషనర్‌కు మహిళా ఉద్యోగుల రాఖీ శుభాకాంక్షలు



నగర పంచాయతీ కమిషనర్‌కు రాఖీ కడుతున్న మహిళా ఉద్యోగులు, మెప్మా ఆర్పీలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 19: రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగర పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, మెప్మా ఆర్పీలు సోమవారం నగర పంచాయతీ కమిషనర్ ఈవీ రమణబాబుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ వారిని ఆశీర్వదించారు.

వరద ముప్పు నుంచి కోవూరును కాపాడండి!

● సీఎంను కోరిన ఎమ్మెల్యే ప్రశాంతి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి

అనంతసాగరం, ఆగస్టు 19: పెన్నానదికి ఇరువైపులా పోతిరెడ్డిపాలెం నుంచి ముదివర్తి వరకు, పల్లిపాడు గాంధీ ఆశ్రమం వద్ద రిటర్నింగ్‌వాల్స్ నిర్మించి కరకట్ట లను పటిష్ఠపరిచి కోవూరు నియోజకవర్గాన్ని వరద ముప్పు నుంచి కాపాడాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. సోమవారం సోమశిలకు వచ్చిన సీఎంను ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గంలో మరమ్మతులకు నోచుకోని మలిదేవి కెనాల్, సదరన్ ఛానల్, పైడేరు ఛానల్, తదితర సాగునీటి కాలువల దుస్థితిని సీఎంకు వివరించారు. ముదివర్తిపాలెం వద్ద నత్తనడకన సాగుతున్న కాజ్‌వే నిర్మాణానికి నిధులు అందజేసి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని విన్నవించారు. అలాగే మరికొన్ని సమస్యలపై వినతిపత్రం అందించారు. అంతకుముందు సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే రాఖీ కట్టారు.

వక్ఫ్ భూములను కాపాడండి

● తహసీల్దారుకు ఆవాజ్ కమిటీ నేతల వినతి



కోవూరు : తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

కోవూరు, ఆగస్టు 19: రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల్ని కాపాడాల్సిందిగా ఆవాజ్ కమిటీ నాయకులు సోమవారం తహసీల్దారు నిర్మలానంద బాబాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ నాయకుడు చాంద్ బాషా మాట్లాడుతూ వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, అధికారులు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు అఫ్రోజ్, కాలేషా పాల్గొన్నారు.

●బుచ్చిరెడ్డిపాళెం: మండలంలో వక్ఫ్ భూములకు రక్షణకంచె ఏర్పాటుచేసి సూచిక బోర్డులు పెట్టాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లుకు వినపత్రం సమర్పించి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్టాల పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. భవిష్యత్తులో చట్ట సవరణల రద్దుకు జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ముస్లిం మైనారిటీలు, మసీదు కమిటీలు, మకాన్ కమిటీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ మండల కార్యదర్శి షేక్ మునీర్‌అహ్మద్, ఉపాధ్యక్షులు జానీబాష, బాబు, సందాని, మాబాషా పాల్గొన్నారు.

ఎంపీడీవోకి సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 19: స్థానిక ఎంపీడీవో నరసింహరావును సోమవారం పలువురు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు. గతంలో ఇక్కడ పనిచేసి ఎన్నికల్లో అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి బుచ్చి ఎంపీడీఓగా వచ్చిన ఆయన్ను మండలంలోని సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు.

మండుతున్న ఎండలతో ప్రజల అవస్థలు

పొదలకూరు, ఆగస్టు 19: మండుతున్న ఎండలు, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీల వరకు నమోదవుతోంది. మరో వేసవిని తలపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు రెండో వారం నుంచి వానల్లేవు. పొడి వాతావరణమే కనిపిస్తోంది.

కోల్‌కతా ఘటనపై విద్యార్థినుల నిరసన



కోవూరులో విద్యార్థినుల నిరసన ప్రదర్శన

కోవూరు, ఆగస్టు 19: కోల్‌కత్తాలో ఇటీవల జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ పట్టణంలో సోమవారం ఏఐడీఎస్‌వో నాయకత్వంలో విద్యార్థినులు ప్రదర్శన చేపట్టారు. బజారు కూడలి నుంచి ప్రారంభమైన ప్రదర్శన తహసీల్దారు కార్యాలయానికి చేరుకుంది. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రదర్శనలో ఏఐడీఎస్‌వో నాయకులు పద్మ, ప్రసూన, రజియా తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కాన్పుల శాతం పెంచాలి

● జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

వెంకటాచలం, ఆగస్టు 19: పీహెచ్‌సీల్లో కాన్పుల శాతం పెంచా లని జిల్లా అడిషనల్ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచిం చారు. మండలంలోని కసు మూరు పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. ఈసంద ర్భంగా 100 శాతం లక్ష్యానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో వారానికి మించి దగ్గు ఉన్న వారిని గుర్తించి గళ్ల పరీక్షలు చేయాలన్నారు. అలాగే శ్రీరామపురం బీసీజీ వ్యాక్సినేషన్ క్యాంపును సందర్శించి లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనురాధ, సీహెచ్‌వో రామసుబ్బారెడ్డి, హెచ్‌వీ రాజేశ్వరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు

● అధిక ధరకు మద్యం విక్రయాలు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 19: గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తుండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని మహిళలు వాపోతున్నారు. మండలంలో ఆరు మద్యం దుకాణాలు ఉన్నాయి. నరుకూరు, ఇసుకపాలెం, సాలిపేట, కోడూరు, మహాలక్ష్మీపురంలో గత వైసీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ఏర్పాటుచేసింది. ఆ దుకాణాల పరిధిలో ఉన్న కొత్తపాలెం, వెంకన్నపాలెం, కోడూరు, చింతోపు, వరకవిపూడి, అనంతపురం, ముంగలదొరువు, ఈదూరు, పొట్లపూడి, చిన్నచెరుకూరు తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం దొరుకుతోంది. బెల్టుషాపుల నిర్వాహకులు, మద్యం షాపులో పనిచేసే సేల్స్ మెన్లు చేతులు కలిపి ఒక్కో బాటిల్‌పై రూ. 20 అదనంగా తీసుకుని మద్యం సరఫరా చేస్తూ వాటాలు పంచుకుంటున్నారు. బెల్ట్ దుకాణదారులు మాత్రం ఒక్క బాటిల్‌పై రూ.50 నుంచి రూ.150 వరకు మందు బాబుల నుంచి గుంజుతున్నారు. మద్యం షాపుల దగ్గర నిత్యం గొడవలు జరుగుతున్నాయని, ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గురుకుల విద్యార్థినులకు హిమోగ్లోబిన్ టెస్ట్

రాపూరు, ఆగస్టు 19 : స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని 198మంది విద్యార్థినులకు హెచ్‌బీ టెస్టు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె.క్రిష్టియానా జేమ్స్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం తిరిగి పాఠశాలు ప్రారంభమయ్యాక, అడ్మిషన్లు పూర్తి అయిన తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రతినెలా ఈ టెస్ట్ చేయిస్తామని తెలిపారు. విద్యార్థినులలో రక్తహీనతను తగ్గించడం కోసం ప్రతివారంలో ఒకరోజు ఐరన్ మాత్రలు కూడా వేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాపూరు కో లోకేటెడ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.సుదర్శనమ్మ పాల్గొన్నారు.

మంత్రి నారాయణతో ఐజీ భేటీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 19 : మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలతోపాటు పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

పేదలకు తోపుడుబండ్లు, కుట్టుమిషన్లు

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం
పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 19 : ఎన్నికల ప్రచారంలో పలువురి పేదల కష్టాలు తెలుసుకుని తాము అధికారంలోకి వస్తే వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అందులో భాగంగా సోమవారం తన కుమార్తె శరణితో కలిసి నగరంలోని గోమతి క్యాంపు కార్యాలయంలో 23 మందికి తోపుడు బండ్లు, 40 మంది పేదలకు కుట్టు మిషన్లు నారాయణ ట్రస్ట్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదలకు ఆర్థిక, జీవనోపాధికి తోడ్పాటు అందించడంలో భాగంగా ఇప్పటి వరకు 200 మందికి తోపుడు బండ్లు, 40 మందికి కుట్టుమిషన్లు అందించామని పేర్కొన్నారు. నారాయణ కుమార్తె శరణి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెల్లూరు నగరాన్ని మెట్రోసిటీగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి రాఖీ కట్టిన పొదుపు మహిళలు

నెల్లూరు(హరనాథపురం) : రాఖీ పౌర్ణమి సందర్భంగా నగరంలోని పొదుపు మహిళలు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణకు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో రాఖీలు కట్టారు. నారాయణ సైతం వారికి స్వీట్లు తినిపించారు.



తోపుడు బండి అందిస్తున్న మంత్రి నారాయణ, శరణి

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

● ఎన్ఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



అర్జీ పరిశీలిస్తున్న ఎస్ఈ సంపత్‌కుమార్

నెల్లూరు(సిటీ), ఆగస్టు 19 : ప్రజల నుంచి వివిధ సమస్యలపై అందే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సంపత్‌కుమార్, సీపీ దేవికుమారి పాల్గొని నగరంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వచ్చిన వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి తాత్కాలికంగా కాకుండా శాశ్వత రీతిలో పరిష్కరించాలని వివిధ విభాగాల అధికారులకు సూచించారు. ఈ వారం వచ్చిన అర్జీలన్నింటికి వచ్చే వారంలోపు పరిష్కారం చూపాలన్నారు.

కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞాపకమే ఫొటో

● ఫొటోగ్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్



డాగురె చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 19 : ప్రస్తుత పరిస్థితిలో కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞాపకాలే ఫొటో అని ఫొటోగ్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొంతు శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీహెచ్‌పీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ నిర్మాణ కర్త లూయిస్ డాగురె చిత్ర పటాకిని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పీహెచ్‌పీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు షేక్ సత్తార్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, శ్రీలక్ష్మి స్టూడియో శేఖర్, నవ్యాంధ్ర రచయితల సంఘం కోశాధికారి రాఘవేంద్ర, నారాయణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక పాఠశాలలో రక్షాబంధన్



నెల్లూరు(విద్య), ఆగస్టు 19 : నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలను పంపిణీ చేసి రక్షాబంధన్ విశిష్టతను తెలియచేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్‌రావు, విద్యావలంటీర్ రాశి, సిబ్బంది పాల్గొన్నారు.

పాశ్చాత్య సంస్కృతితోనే యువత పెడదోవ

నెల్లూరు(సాంస్కృతికం): పాశ్చాత్య సంస్కృతికతోనే యువత పెడదోవ పడుతోందని సమరసత జిల్లా ప్రచారక్ ప్రముఖ్ జయప్రకాష్ అన్నారు. సోమవారం స్వతంత్ర్య పార్కులో రాఖీ వేడుకలు సమరసత వేదిక ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో కేశవ నాయక్, న్యాయసేవ ప్రముఖ్ రాజేంద్ర, అరవ రామమోహన్, డాక్టర్ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరుపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, ఆగస్టు 19 : నగరంలోని కల్లూరుపల్లిలో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఒకే విధమైన రాజకీయం చేయడం తెలుసన్నారు. అధికారంలో ఉన్నామని పొంగను, అలాగని అధికారం లేదని కుంగేది లేదన్నారు. వరుసగా మూడు పర్యాయా లు తనను ఎమ్మెల్యేగా రూరల్ ప్రజలు గెలిపించారని, ఆ రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అరవ శాంతి, నాయకులు శ్రీను, కుల్లూరు రాఘవేంద్రరావు, హృదయ్‌కుమార్, ఆవుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జనవాణి : జనసేన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 19: జిల్లాలో త్వరలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణి కార్యక్రమం ప్రారంభిస్తున్నామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం పలువురు ప్రజలు వారి సమస్యలను జనసేన పార్టీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ జనవాణి కార్యక్రమం ద్వారా వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని, ఆ క్రమంలోనే ప్రజలు వారి సమస్యలు జనసేన నాయకుల వల్ల పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో పార్టీ కార్యాలయానికి వస్తున్నారన్నారు. త్వరలోనే జిల్లాలోనూ జనవాణి కార్యక్రమం ప్రారంభించి ప్రజల సమస్యల పరిష్కారం వైపు అడుగులు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత నాయకులు పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్' సభ్యుల రక్తదానం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 19 : రెడ్‌క్రాస్ రక్తనిధిలో సోమవారం మేనేజింగ్ కమిటీ సభ్యులు స్వచ్ఛంద రక్తదానం చేశారు. మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ 50వ సారి రక్తదానం చేయగా సభ్యులు నిరంజన్, రవికుమార్, కేశవులు, ఆశ్రిత్ రక్తదానం చేశారు. రక్తదానం ఆవశ్యతను గుర్తించి ప్రతి ఒక్కరు ఏడాదికి 4 సార్లు రక్తదానం చేయాలని కోరారు. కృత్రిమంగా రక్తం తయారు చేయలేమని, అత్యవసర స్థితిలో ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేస్తూ ప్రోత్సహించాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో రాఖీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పలువురు సభ్యులకు రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్, షేక్ రఫీక్ అహ్మద్, రెడ్‌క్రాస్ కార్యాలయ కార్యదర్శి మస్తానయ్య, దివ్యాంగుల కేంద్రం ప్రిన్సిపాల్ గురునాథరావు, మొర్సు కన్వీనర్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్నదానం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 19 : వీపీఆర్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వీపీఆర్ యువసేన నిర్వాహకులు అరవిందరెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వీపీఆర్ దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని వీపీఆర్ యువసేన ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్, సుమన్, ప్రసాద్, గణేష్, భూపేష్, హరికృష్ణ, సునీల్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నగర కమిషనర్



నెల్లూరు(సిటీ), ఆగస్టు 19 : జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు పరిశీలనకు సోమవారం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ మర్యాదకపూర్వకంగా కలిశారు. ఆయన బాధ్యతలు స్వీకరించాక ఇదే తొలి సీఎం పర్యటన కావడంతో సోమశిల ప్రాజెక్టు వద్దకు వెళ్లి సీఎంను కలసి పుష్పగుచ్ఛం అందచేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన జనసైనికుడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సోమశిల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలీపాడ్ వద్ద జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గరుడుడిపై ప్రసన్నుడి చిద్విలాసం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 19 : శ్రావణ పౌర్ణమి సందర్భంగా నగరంలోని మాగుంట లే అవుట్‌లో గల ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గరుడ వాహన సేవ జరిగింది. ఉదయం విశేష తిరుమంజనం, పూజలు, రాత్రి పేట ఉత్సవం జరిగాయి.

● రాజరాజేశ్వరి ఆలయంలో మూలమూర్తికి అభిషేకాలు, ఉత్సవమూర్తులకు 54 కేజీల పసుపు కుంకుమలతో అభిషేకాలు జరిగాయి. అనంతరం సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. గాయత్రి అమ్మ వారికి అభిషేకాలు, పూలంగిసేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఈవో, సహాయ కమిషనర్ బీ వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

● సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో శ్రీకృష్ణస్వామికి అభిషేకాలు, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమం జరిగాయి. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కు మార్ పర్యవేక్షించారు.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్వామివారికి మంగళ హారతులు, భక్తులకు అన్నప్రసాద వితరణలు జరిగాయి. అర్చకుడు బీ శ్రీనివాసస్వామి, ఆలయ అధ్యక్షుడు బీవీ రాఘవేంద్ర, ధర్మకర్త సీహెచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుబ్బరామ రాజు పర్యవేక్షించారు.

● పప్పులవీధి పాండురంగస్వామి ఆలయంలో శ్రీపీఠం వ్యవస్థాపకుడు లలిత శివకుమార్ ఆధ్వర్యంలో చండీహోమం జరిగింది.



రాజరాజేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

విఖనస మహర్షికి ప్రత్యేక పూజలు

నెల్లూరు రూరల్ : వేద గిరి క్షేత్రంలో సోమవారం విఖనస మహ ర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది గురువైన మహర్షికి విశేష అభిషేకాలు, అ ర్చన జరిగాయి. అనంతరం పౌర్ణమి తిథి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు నిర్వ హించి గరుడ వాహనంపై గిరిప్రదక్షణ జరిపారు. ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.



గరుడవాహనంపై దేవేరులతో వేంకటేశ్వరుడు

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



పరిశ్రమల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన



చంద్రబాబుకు రాఖీ కడుతున్న మంత్రి అనిత



పరిశ్రమల నమూనాల తిలకింత



పరిశ్రమలకు ప్రారంభోత్సవం

అత్యుత్తమ ఆర్థిక మండలిగా శ్రీసిటీ

- తక్కువ వ్యయంతో ఉత్పత్తులు సాధించేందుకు కేంద్రం కావాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు
- 15పరిశ్రమల ప్రారంభం... 7యూనిట్లకు భూమిపూజ.... మరో ఐదింటి స్థాపనకు ఎంవోయూలు





శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు చేరువగా వున్న శ్రీసిటీని అత్యుత్తమ ఆర్థిక మండలిగా తీర్చిదిద్దాలన్న ఆలోచన వుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.దానికి అనుగుణంగా శ్రీసిటీ ఐజీబీసీ గోల్డెన్ రేటింగ్ గుర్తింపు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. సోమవారం మధ్యాహ్నం శ్రీసిటీలో పర్యటించిన ఆయన సుమారు 30 ప్రతిష్టాత్మక పరిశ్రమలు, కంపెనీలకు చెందిన సీఈవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటికే శ్రీసిటీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు వున్నాయని, వాటిని మరింతగా మెరుగుపరిచి అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మారుస్తామని ప్రకటించారు. పచ్చదనం కోసం వందశాతం వర్షపునీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. వీలైన మేరకు ఉత్పత్తి, రవాణా ధరలు తగ్గించాల్సి వుందని, ఆ దిశగా తమ ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 30 దేశాలు పరిశ్రమలు ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న శ్రీసిటీ తక్కువ వ్యయంతో ఉత్పత్తులు సాధించేందుకు కేంద్రం కావాలని ఆకాంక్షించారు.శ్రీసిటీలో పారిశ్రామికవేత్తలు ఉపాధిని, సంపదను సృష్టిస్తున్నారని కొనియాడారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, అదే విధంగా అవి సృష్టించే సంపద సంక్షేమానికి, సాధికారతకు దోహదపడుతుందన్నారు.



అగ్నిమాపక కేంద్రానికి ప్రారంభోత్సవం

పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజ

శ్రీసిటీలో సీఎం చంద్రబాబు సోమవారం పలు పరిశ్రమలను ప్రారంభించగా మరికొన్నింటికి భూమిపూజ చేశారు. అలాగే కొన్ని పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రూ. 1570 కోట్ల పెట్టుబడులతో 8,480 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ఏర్పాటైన 15 పరిశ్రమలను సీఎం ప్రారంభించారు. అలాగే రూ. 900 కోట్ల పెట్టుబడులతో 2,740 మందికి ఉపాధినిచ్చే ఏడు పరిశ్రమల



శ్రీసిటీ ప్రగతి చిత్రాల ప్రదర్శన

నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా రూ. 1213 కోట్ల పెట్టుబడులతో 4,060 మందికి ఉపాధి కల్పించే ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఎంఓయూలపై సంతకాలు చేశారు. వీటితో పాటు శ్రీసిటీలో నూతనంగా నిర్మించిన ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించిన చంద్రబాబు హైటెక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు మునుపు చంద్రబాబు విమానంలో రేణిగుంటలోని విమానా శ్రయానికి నిర్ణీత సమయం కంటే అరగంట ఆలస్యంగా 12.10గంటలకు చేరుకున్నారు.అధికారులు,ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అక్కడి నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరి శ్రీసిటీకి 12.40గంటలకు చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, ఎండీ రవీంద్రసన్నారెడ్డి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అక్కడ నుండి బిజినెస్ సెంటర్‌కు చేరుకున్న సీఎంకు పూర్ణకుంభం, మేళతాళాలతో ఆహ్వానం పలికారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిషోర్, డీఐజీ షిమోషీ బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బారాయుడు, ఎమ్మెల్యేలు ఆదిమూలం, ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, నెలవల సుబ్రమణ్యం, పరసా రత్నం, వరప్రసాద్, ఎస్వీ నాయుడు తదితరులు స్వాగతం పలికారు.శ్రీసిటీలో కార్యక్రమాలు ముగించుకుని 2.40గంటలకు హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా సోమశిల ప్రాజెక్టు సందర్శనకు చంద్రబాబు బయల్దేరి వెళ్ళారు.అక్కడినుంచి సాయంత్రం 6.20గంటలకు రేణిగుంటకు చేరుకున్న చంద్రబాబు విజయవాడకు తిరుగుపయనమయ్యారు.

చంద్రబాబు తొలి పర్యటనతోనే జిల్లాకు భారీ ప్రయోజనాలు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక కుటుంబంతో కలసి నేరుగా తిరుమల వచ్చి శ్రీవారిని దర్శించుకుని వెళ్ళారు. ముఖ్యమంత్రిగా అధికారికంగా సోమవారం జిల్లాకు తొలి పర్యటన జరిపారు. అయితే తొలి పర్యటనతోనే ఆయన జిల్లాకు భారీగా ప్రయోజనాలు కల్పించి వెళ్ళడం విశేషం. నిర్మాణం పూర్తయి ఉత్పత్తి ప్రారంభించేందుకు సంసిద్ధమైన 15 పరిశ్రమలను చంద్రబాబు ప్రారంభించారు. ఈ పరిశ్రమల మొత్తం పెట్టుబడులు రూ. 1570 కోట్లు కాగా వీటి వల్ల ఏకంగా 8040 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఇందులో సింహభాగం జిల్లాకు చెందిన యువతే లబ్ధి పొందుతుండడం గమనార్హం. అలాగే 7 పరిశ్రమల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. వీటి పెట్టుబడుల విలువ రూ. 900 కోట్లు కాగా వీటి ద్వారా 2740 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇదే వేదికగా రూ. 1213 కోట్ల పెట్టుబడుల అంచనాతో ముందుకొచ్చిన ఐదు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులతో చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒప్పందాలు కుదుర్చుకుని వాటిపై సంతకాలు చేశారు. ఈ పరిశ్రమలు ఏర్పాటైతే వీటి వల్ల 4060 మందికి ఉద్యోగాలు రానున్నాయి. మొత్తంమీద చంద్రబాబు శ్రీసిటీలో గడిపిన రెండున్నర గంటల వ్యవధిలో జిల్లాకు రూ. 3683 కోట్ల పెట్టుబడులు రావడానికి, తద్వారా 15280 ఉద్యోగాల కల్పనకు కార్యరంగం సిద్ధమైంది. ఈ పరిణామం కూటమి పార్టీల శ్రేణులతో పాటు జిల్లా ప్రజలకు ప్రత్యేకించి నిరుద్యోగ యువతకు సంబరం కలిగిస్తోంది. గత ఐదేళ్ళలో పరిశ్రమలకు ముఖం వాచిన జిల్లా ఇపుడు చంద్రబాబు సీఎం అయిన కేవలం 70 రోజులకే ఇంత భారీ ఎత్తున జిల్లాకు ప్రయోజనాలు కల్పించడం ప్రజల్లో ఆశలు రేకెత్తించింది.కాగా సీఎం శ్రీసిటీ పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి జాతీయ రహదారి వరకు పోలీసు ఆంక్షలు అమలయ్యాయి.భారీ బందోబస్తుతో దారిలో వెళ్లే ప్రజలను సైతం అడ్డుకున్నారు.చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు తెలుగు తమ్ముళ్లు పెద్దఎత్తున హెలిప్యాడ్ వద్దకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మండలాల నాయకులు తడకు తరలివచ్చారు. అయితే వారిని హెలిప్యాడ్ పరిసరాలకు సైతం అనుమతించలేదు.

కూలిన చోటే.. కొత్త చిగురు..!

తుపాను ధాటికి కూలిన ఊడల మర్రి



ఎస్వీయూలో దశాబ్దాల నాటి ఊడల మర్రి కథ ఇదీ



కొత్త చిగురు వేసిన చిత్రం

కూలిన చోటే.. కొత్త చిగురు వేసిన ఓ ఊడల మర్రి కథ ఇది.తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం భవన్ వద్ద ఏపుగా పెరిగి ఎన్నో పశుపక్ష్యాదులకు నెలవుగా నిలిచిన సుమారు యాభై ఏళ్ళ నాటి మర్రి చెట్టు 2023 డిసెంబరు 4వ తేదీ 110 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు (మిచౌంగ్ తుపాన్) కూలి పోయింది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో మర్రిచెట్టుకు పైనున్న అన్ని కొమ్మలను నరికి వేసి కాండం మాత్రం వదిలి పెట్టారు. ప్రకాశం భవన్‌కు ఆనుకొని ఉన్న టెన్నిస్, వాలీబాల్ కోర్టులకు ఎదురుగా ఉన్న ఈ మర్రిచెట్టు కూలడంతో యూనివర్సిటీ ఇంజనీరింగ్ సిబ్బంది ఆవేదన చెందారు. ఈ మర్రిచెట్టును ఎలాగైనా మళ్ళీ నిలబెట్టాలన్న ఆలోచనతో వేర్లన్నింటినీ పూడ్చి భారీ కాండం గల మర్రి చెట్టును కొంత కాలం క్రితం నిలబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మర్రి చెట్టు కొత్త చిగురు వేసింది. మన దేశ జాతీయ వృక్షంగా ఉన్న మర్రి చెట్టు కొత్త చిగురు వేయడానికి కారణమైన ఇంజనీరింగ్ సిబ్బంది, యూనివర్సిటీ అధికారుల చొరవ పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నం ద్వారా ప్రకృతి సోయగాన్ని మరింతగా పెంపొందించి అందరికీ ఆహ్లాదాన్ని పంచినట్టయ్యిందని కితాబు ఇచ్చారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)



స్విమ్స్‌లో జూడాల ప్రదర్శన

ప్రాణం పోసే వారి ప్రాణాలే తీస్తారా..?

- స్విమ్స్, రుయాస్పత్రుల్లో ఆగని నిరసనలు



రుయాస్పత్రి వద్ద నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 19 : ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలు అమానుషంగా తీస్తున్నా పట్టించుకునే వారు లేకపోవడం సరికాదని స్విమ్స్, రుయాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో మహిళా డాక్టరుపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ వారు చేస్తున్న న్యాయ పోరాటం సోమవారం కూడా కొనసాగింది. ఈ క్రమంలో వారు ప్రభుత్వాల నిర్లక్ష్యం, సమాజంలో డాక్టర్ల ప్రాధాన్యత, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు.. నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ స్విమ్స్‌లో పలు నాటక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం హత్యాచారానికి కారకులను కఠినంగా శిక్షించి, జూనియర్ డాక్టరు కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూడాలకు పలువురు సీనియర్ డాక్టర్లు మద్దతు తెలిపారు.

హత్యాచారంపై వెల్లువెత్తిన నిరసనలు

గూడూరు, ఆగస్టు 19: కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జూనియర్ మహిళా డాక్టర్ హత్యాచారం ఘటనను వ్యతిరేకిస్తూ సోమవారం పట్టణంలో పలువురు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో బీజేవైఎం నాయకులు, కళాశాల విద్యార్థినులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధికారప్రతినిధి మనోజ్ కుమార్ మాట్లాడుతూ... కోల్‌కతాలో ట్రైనీ మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసి కిరాతకంగా హత్యచేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివశంకర్, నవీన్, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు. స్థానిక టవర్ క్లాక్ కేంద్రం వద్ద ఆదిశంకర పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ... దేశంలో మహిళలపై హత్యాచారాలు, లైంగికదాడులు పెరగడం దురదృష్టకర మన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు స్పందించి బాధ్యతాయుతంగా వ్యవహరించి ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సునీత సేవాసంస్థ కార్యాలయంలో ట్రైనీ మహిళా డాక్టర్ హత్యాచారంపై నిరసన తెలుపుతూ ఆమె ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, గ్రీష్మ, జ్యోతి, తనూజ, హసీనా తదితరులు పాల్గొన్నారు.









డీఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థినుల నిరసన - టవర్‌క్లాక్ వద్ద ఆదిశంకర విద్యార్థుల నిరసన - కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మహిళలు - సూళ్లూరుపేటలో ఉపాధ్యాయుల నిరసన

కఠినంగా శిక్షించాలి

సూళ్లూరుపేట: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేశారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మానస, నరేంద్ర, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, దాడులకు నిరసగా కొవ్వొత్తులు వెలిగించి నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల కార్యదర్శి ప్రభాకర్, సీఐయూటీ నాయకులు సాంబశివయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు రాఖీ కట్టిన విజయశ్రీ



తడ, ఆగస్టు 19 : సీఎం చంద్రబాబుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాఖీ కట్టి ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. సోమవారం శ్రీసిటీ పర్యటనకు వచ్చిన ఆయన్ను హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ సీఎంకు రాఖీ కట్టి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. వారితోపాటు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కూడా ఉన్నారు.

సీఎం దృష్టికి ఆల్తూరుపాడు రిజర్వాయర్ సమస్య

ఎమ్మెల్యే కురుగొండ్ల



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కురుగొండ్ల

డక్కిలి, ఆగస్టు 19: జిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబు దృష్టికి ఆల్తూరుపాడు రిజర్వాయర్ సమస్యను తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. సోమవారం సోమశిల జలాశయ పరిశీలనకు వచ్చిన సీఎంను కురుగొండ్ల మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ... డక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామంలో అర్థంతరంగా ఆగిపోయిన సోమశిల-స్వర్ణముకి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.400 కోట్లు కేటాయించ డమే కాకుండా పనులు మొదలు పెట్టారన్నారు. అనంతరం 2019లో వైసీపీ ప్రభుత్వం రీటెండర్ పేరుతో నిర్మాణాన్ని అడ్డుకుందన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు, శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు

సీఎం చంద్రబాబును కలిసిన పాశిం



గూడూరు, ఆగస్టు 19: శ్రీసిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం తిరుపతి విమానాశ్రమానికి చేరుకున్న సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజక వర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్



విజయకుమార్‌నాయుడికి రాఖీ కడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, ఆగస్టు 19 : మండలంలో సోమవారం రక్షాబంధన్ (రాఖీ) పండుగ ఘనంగా జరిగింది. ఈ పండుగను పురస్కరించుకుని తమ సోదరులకు అక్క, చెల్లెమ్మలు రాఖీలు కట్టి ప్రేమను చాటుకున్నారు. కాగా ఓజిలి మండల కన్వీనరు జి.విజయ కుమార్‌నాయుడికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాఖీ కట్టారు. అంతకుముందు చంద్రబాబు శ్రీసిటీ పర్యటనలో ఓజిలి మండల టీడీపీ నాయకులు జి.విజయకుమార్ నాయుడితో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా విజయకుమార్‌నాయుడు హోం మంత్రి వి.అనితను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎంను కలిసిన వేనాటి



సూళ్లూరుపేట, ఆగస్టు 19: శ్రీసిటి పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీసిటీలోని హెలిప్యాడ్ వద్ద సీఎంకు తమ ప్రాంత సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు.

తహసీల్దారుతో టీడీపీ నాయకుల భేటీ



కోట, ఆగస్టు 19: కోట తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు కె.జయజయ రావును టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగు మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గుండవరం సుష్మారెడ్డి తహసీల్దారును శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. అదే విధంగా టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, జానా వెంకటకృష్ణయ్య, చెంగ్రావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు టి.మురళీ తహసీల్దారును సత్కరించారు.

నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు



కిషోర్‌బాబు

గూడూరు, ఆగస్టు 19: గూడూరు రూరల్ సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడుతానని రూరల్ సీఐ కిషోర్‌బాబు చెప్పారు. సోమవారం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాల యంలో సీఐగా బాధ్యతలు చేపట్టారు. విజయవాడ సీఐడీ ప్రధాన కార్యాలయం నుంచి గూడూరు రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గంజాయి, ఇసుక, క్వార్ట్జ్ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు అర్బన్, ఆగస్టు 19: మండలంలోని విందూరు గిరిజన కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాలనీలో అవసరం మేరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయక పోవడంతో స్థానికులు అంధకారంలో జీవించాల్సి వస్తోందన్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉండడంతో ఇంటికి కరెంటు మీటరు బిగించుకోవాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. శివకుమార్, బీవీరమణయ్య, శ్రీనివాసులు, సురేష్, ప్రసాద్, శంకరయ్య, వెంకట రమణమ్మ, రాజ్యలక్ష్మీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సర్వే నిర్వహించండి



బాలాయపల్లి, ఆగస్టు 19: మండలంలో ప్రతి ఇంటికి వెళ్లి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 సర్వే నిర్వహించాలని బీఎల్వోలను తహసీల్దార్ కెవిఆర్‌వి ప్రసాద్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 20 నుంచి అక్టోబరు18 వరకు కొత్త ఓటర్ల చేర్పులు, చనిపోయిన ఓటర్ల తొలగింపులు, ఓటర్ల సవరణలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శిరీష, ఏఎస్ఓ వరసుందరం తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పోలీసు ఆంక్షలు

- హెలిప్యాడ్ పరిసరాలకు సైతం అనుమతి నిరాకరణ
- నిరాశగా వెనుదిరిగిన తమ్ముళ్లు
- నెలవల జోక్యంతో కొందరికి అనుమతి

తడ, ఆగస్టు 19 : సీఎం చంద్రబాబు శ్రీసిటీ పర్యటన నేపథ్యంలో పోలీసు ఆంక్షలు తెలుగు తమ్ముళ్లకు నిరాశ కలిగించింది. సోమవారం మధ్యాహ్నం శ్రీసిటీ హెలిప్యాడ్ వద్దకు సీఎం చేరుకోనున్న నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి జాతీయ రహదారి వరకు పోలీసు ఆంక్షలు అమలయ్యాయి. ఏ ఒక్కరిని అనుమతించలేదు. భారీ బందోబస్తుతో ఆ దారిలో వెళ్లే ప్రజలను సైతం అడ్డుకున్నారు. ఎన్నికల్లో గెలుపొంది ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత శ్రీసిటీకి వస్తుండటంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. దీంతో తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున హెలిప్యాడ్ వద్దకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు తడకు తరలివచ్చారు. అయితే వారిని హెలిప్యాడ్ పరిసరాలకు సైతం అనుమతించలేదు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయ కులు వేనాటి సతీష్‌రెడ్డి, నెలవల రాజేష్‌లతోపాటు మరొకరికి మాత్రమే అనుమతి ఉందని మిగిలిన వారికి లేవంటూ పోలీసులు వెనక్కు పం పారు. దీంతో చంద్రబాబును కలవలేకపోయామని నాయకులు వెను దిరిగారు.



సీఎంను కలసిన టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మన శ్రీధర్

అయితే ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్దకు వచ్చేందుకు కొద్ది సేపటి ముందు నెలవల సుబ్రహ్మణ్యం కల్పించుకొని కొంతమంది నాయకులకు అనుమతి ఇప్పించగలిగారు. సీఎంను కలిసినవారిలో టీడీపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు బి.శ్రీధర్, నాయకులు రఫి, బి.పళణి, సెల్వం, విజయ కు మార్‌నాయుడు,నాగేంద్రప్రసాద్, సుదర్శన్,ఏ.రమేష్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నేత ఆక్రమిత ప్రభుత్వ భూమి స్వాధీనం

డక్కిలి, ఆగస్టు 19: మండలంలోని పలుగోడు గ్రామానికి చెందిన వైసీపీ నేత ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె ఏర్పాటు చేశారని ఫిర్యాదు అందడంతో సోమవారం రెవెన్యూ అధికారులు దాన్ని తొలగించారు. మరో 40 సెంట్లకు అక్రమంగా అడంగళ్ తీసుకున్నారని, దాన్ని పరిశీలించి రద్దు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఫిర్యాదులు అందితే తక్షణమే స్పందిస్తున్నామన్నారు. వీఆర్వోలు భూములు ఆక్రమణకు గురికాకుండా క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినట్టు తేలితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఆక్రమణ తొలగింపులో వీఆర్వోలు ఆమని, నాగేంద్ర సహా సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్ సాయంతో కంచె తొలగింపు పనులు

ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగ

గూడూరు, ఆగస్టు 19: ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచేదే రాఖీ పండుగని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి సిస్టర్ వాణి ఎమ్మెల్యేకు రక్షాబంధన్ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతిరూపంగా నిలుస్తుందన్నారు. ప్రతి సోదరుడు తన సోదరికి రక్షణగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. మహిళలపై ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా పురుషులు సోదరభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. సులోచనమ్మ, శైలజ, మస్తాన్‌నాయుడు, గురునాథం, శ్రీనివాసులురెడ్డి, రామచంద్రయ్య, ప్రకాష్ పాల్గొన్నారు. సరస్వతి శిశు మందిరంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ తనూజ, స్నేహలత, అనిత, జీవని, రంగనాయకులు పాల్గొన్నారు. మినీగురుకులం పాఠశాలలో శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో రాఖీపండుగను నిర్వహించారు. పట్టణంలో పలువురు అక్కాచెల్లెళ్లు, అన్నతమ్ముళ్లకు రక్షా బంధన్ కట్టి పండుగను జరుపుకున్నారు.



ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న సిస్టర్ వాణి

‘కోణార్క్’ వేరుశనగ రకం తిరుపతి ఆర్ఏఆర్ఎస్‌లో ప్రాణం పోసుకుంది

ఏడీఆర్ సుమతి వెల్లడి



శాస్త్రవేత్తలతో కలసి కోణార్క్ వేరుశనగ రకాన్ని ప్రదర్శిస్తున్న సుమతి

తిరుపతి రూరల్, ఆగస్టు 19: ‘దేశప్రధాని నరేంద్రమోదీ ఈనెల 11వ తేదీన న్యూఢిల్లీలోని అఖిల భారత వ్యవసాయసంస్థలో విడుదల చేసిన 109 రకాల కొత్త వంగడాల్లో కోణార్క్ (టీసీజీఎస్-1707)రకం తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్ఏఆర్ఎస్)లో ప్రాణం పోసుకుంది. ఇందులో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌పీ వాసంతి నేతృత్వంలో మొక్కల ప్రజనన విభాగ (ప్లాంట్ బ్రీడింగ్) శాస్త్రవేత్తలు జాన్, శ్రీవిద్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, అమరావతి కీలకపాత్ర పోషించారు. 2013లో ఈ పరిశోధన చేపట్టగా, ఈ ఏడాదిలో కొత్తరకం వంగడం సిద్ధమైంది’ అని సోమవారం ఆర్ఏఆర్ఎస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో శాస్త్రవేత్తలతో కలిసి ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి వెల్లడించారు. ఇటీవల వివిధ వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన రకాలను డెవలప్‌చేసి విడుదల చేశామని వివరించారు. 2022లో విశిష్ట(టీసీజీఎస్-1694), 2023లో హిమనీ(టీసీజీఎస్-1522) రకాలను విడుదల చేయగా.. 2024లో కొత్తవంగడం కోణార్క్(టీసీజీఎస్-1707)ని ప్రధాని నరేంద్రమోదీ విడుదల చేశారని తెలిపారు. శాస్త్రవేత్తలు మురళీకృష్ణ, ప్రతిమ, కదిరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్(టీసీజీఎస్-1707) ప్రత్యేకతలు

మనదేశంలో ఒడిశా, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల్లో ఖరీఫ్ సీజన్లో సాగు చేసేందుకు అనువైన రకం. ఇది చిన్న గుత్తిరకం. పంటకాలం 105-110 రోజులు. హెక్టారుకు 25క్వింటాళ్ల వరకు దిగుబడి. కాయనుంచి పప్పు దిగుబడి 70-75శాతం ఉంటుంది. నూనె 49శాతం వరకు ఉంటుంది. రసం పీల్చే పురుగులను తట్టుకుంటుంది. ఆకుమచ్చ తెగులు, వేరు కుళ్లు, కాండం కుళ్లు, వేరుఎండు తెగుళ్లని మధ్యస్తంగా తట్టుకుంటుంది. అధిక నీటి వినియోగ సామర్థ్య రకం. గింజలు గులాబీ రంగులో ఉండి కాయలన్నీ ఒకేసారి పక్వానికి వస్తాయి. గింజల్లో నిద్రావస్థ రెండువారాలు వరకు ఉంటుంది. కాగా తల్లిగా (జీపీబీడీ-4)ని, తండ్రిగా ఐసీజీ(ఎఫ్‌డీఆర్ఎస్)79ని సంకరం ద్వారా దీన్ని వృద్ధి చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.21 కోట్లు

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.21 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి సోమవారం ఉదయం ప్రకటించింది.

పీఆర్‌జీఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరిస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరిస్తున్నట్టు నాయుడుపేట తహసీల్దారు గీతావాణి తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలు అర్జీలను తహసీల్దారు స్వీకరించారు. అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకారం

సూళ్లూరుపేట, ఆగస్టు 19: సూళ్లూరుపేట ఎస్ఐగా వి.బ్రహ్మనాయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తుండిన ఎస్ఐ రహీం రెడ్డి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో బ్రహ్మనాయుడుని నియమించారు. ఈ మేరకు ఆయన స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందలు తెలిపారు.

శాస్త్రోక్తంగా చండీహోమం



చిల్లకూరు, ఆగస్టు 19: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ముత్యాలమ్మకు ప్రత్యేకపూజలు జరిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం ముత్యాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హిందువులందరికీ జ్ఞానోదయం కలిగించాలని కోరుకున్నా

తెలంగాణ ఎంపీ అర్వింద్

తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని హిందువులందరికీ జ్ఞానోదయం కలిగించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలంగాణ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. టీటీడీ నుంచి అమెరికాలోని టెక్సస్ వరకు ఉన్న హిందువులందరూ ఐక్యంగా ఉండేలా ఆశీర్వదించమని, భారతావనని కాపాడుకోవాల్సిన బాధ్యతను అందరూ తీసుకోవాలని కోరుకున్నానన్నారు. బంగ్లాదేశ్ నిన్నటి వరకు మన ప్రాంతమేనన్నారు. అక్కడ జరిగింది.. ఇక్కడా జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. అందువల్ల అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. ఇక ఏపీలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న ట్రాక్టర్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19: నాయుడుపేట మండలం పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అర్బన్ సీఐ బాబి స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున సీఐ సిబ్బందితో కలసి జాతీయ రహదారి సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్టు గుర్తించారు. నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చల్లాయానాదుల కాలనీలో అధికారుల బృందం



బడి బయటి పిల్లలతో అధికారులు

కోట, ఆగస్టు 19: మండలంలోని తిన్నెలపూడి పంచాయతీలో గల సాయినగర్ చల్లాయానాదుల గిరిజన కాలనీలో సోమవారం అధికారుల బృందం పర్యటించింది. తిరుపతి సమగ్ర శిక్ష కార్యాలయ ఏఎంవో శివశంకర్, ఏఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, ఎంఈవో మస్తానయ్య బృందం తల్లిదండ్రులతో చర్చించి ఇక్కడ కాలనీలో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయనుంది. బడి బయటి ప్రతి బిడ్డా పాఠశాలలో చేరేలా గిరిజనులకు అవగాహన కల్పించారు.

స్వచ్ఛంద సంస్థలు దత్తత తీసుకోవాలి



నోటు పుస్తకాల పంపిణీలో టీడీపీ నేతలు

కోట, ఆగస్టు 19: పల్లెల్లో వెనుకబడిన గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు స్వచ్ఛంద సంస్థలు గ్రామాలను దత్తత తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డి కోరారు. మండలంలోని తిమ్మానాయుడు పాళెంలో సోమవారం ఎస్తేర్ రాణి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి, పలు అంగన్‌వాడీలకు పలకలు, పెన్సిళ్లు, ఎగ్‌బౌల్‌తో పాటు పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. టీడీపీ నేత ఎస్.మోహన్ రెడ్డి, సంస్థ వ్యవస్థాపకురాలు ఏస్తేర్ రాణి, సభ్యులు నాగేంద్ర, గురునాథం, బత్తయ్య, మునీంద్ర, నాగరాజు, ఎంఈవో మస్తానయ్య, హెచ్‌ఎం మునికృష్ణ తదితరులు ఉన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఆవిష్కరణలపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి దామోదర రెడ్డి

కోట, ఆగస్టు 19: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈడీ సెల్ ఆధ్వర్యంలో ‘రోల్ ఆఫ్ ఇన్నోవేషన్ ఆన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఎకనామిక్ గ్రోత్’ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి డాక్టర్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు తాము చదువుతున్న కోర్సులో పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థులకు ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ప్రతిభా పాటవాల ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా ఆవిష్కరణలు చేయాలన్నారు. ఏరో స్పేస్ టెక్నాలజీలో కావాల్సిన నైపుణ్యాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీహరిరెడ్డి ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

రేపు కొత్తపట్నంలో భూ సర్వే గ్రామసభ

కోట, ఆగస్టు 19: మండల పరిధిలోని కొత్తపట్నం సచివాలయంలో ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు కొత్తపట్నంలో సర్వే చేసిన భూములకు సంబంధించి గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దారు జయజయరావు సోమవారం తెలిపారు. గత నెల 24వ తేదీ నుంచి కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాసపురం, యమదిన్నెపాళెం, గున్నంపడియా, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, మిట్టపాళెం, వాళిళ్లదొరువు గ్రామాల్లో భూ సర్వే చేశామన్నారు. ఆయా భూములకు సంబంధించి సాగుదారుల వివరాలను గ్రామసభలో చదివి వినిపిస్తామన్నారు. ఈ గ్రామసభకు సాగుదారులు అందరూ హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని తహసీల్దారు కోరారు.

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు



శిక్షణ ఇస్తున్న ఎంఈవో శంకరయ్య

పెళ్లకూరు, ఆగస్టు 19: రెండు రోజులపాటు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు ముగిశాయని పెళ్లకూరు మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య అన్నారు. సోమవారం విద్యావనరుల కేంద్రంలో రెండో రోజు జరిగిన తరగతుల్లో ఎంఈవో పాల్గొన్నారు. ప్రాథమిక విద్యార్థుల కోసం విద్యాప్రదేశ్, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంపుదల కొరకు విద్యాప్రవేశం, మాదక ద్రవ్యాలను అడ్డుకోవడానికి ప్రహరీ క్లబ్ ఏర్పాటు, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం, క్లాస్ రూం అబ్జర్వేషన్ కోసం టీచ్‌టూల్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సాయి, శివ, సుధీర్, హరి తదితరులు పాల్గొన్నారు.